# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 224 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | శనివారం 04 అక్టోబర్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 224 04-10-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-


## అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డుపై
# సీఎం చంద్రబాబు అభినందనలు

**సీఎంను కలిసి అవార్డు, ప్రశంసా పత్రం అందించిన మంత్రి సంధ్యారాణి, జీసీసీ ఎండీ**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



అరకు కాఫీ ద్వారా జాతీయ స్థాయిలో బిజినెస్ లైన్ ఛేంజ్ మేకర్ అవార్డు దక్కించుకున్న

- తరువాయి 2లో..



## అమరావతిలో
## పెట్టుబడులు పెట్టేందుకు
# మలేషియా కంపెనీల ఆసక్తి

**సచివాలయంలో మంత్రి నారాయణతో భేటీ అయిన మలేషియా ప్రతినిధులు**

**సమావేశంలో పాల్గొన్న మలేషియాలోని సెలాంగార్ స్టేట్ ఎక్స్ కో మంత్రి పప్పారాయుడు, క్లాంగ్ ఎంపీ గనబతిరావ్,మలేషియా - ఆంధ్రా బిజినెస్ చాంబర్ ప్రతినిధులు**

**అమరావతి నిర్మాణం గురించి మలేషియా బృందానికి వివరించిన మంత్రి నారాయణ**

**రెండున్నరేళ్లలో అమరావతి రాజధాని నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడి**

**రాబోయే 5 ఏళ్లలో 6000 నుంచి 10000 కోట్ల పెట్టుబడులు పెట్టేలా పలు ప్రాజెక్ట్‌లను మంత్రి నారాయణకు వివరించిన మలేషియా ప్రతినిధులు**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అమరావతిలో రాబోయే ఐదేళ్లలో 6వేల నుంచి 10 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీలు ఆసక్తి కనబరిచాయి.ఈ నెల ఒకటో తేదీ నుంచి మలేషియా బృందం అక్కడి మంత్రి,ఎంపీతో కలిసి అమరావతిలో పర్యటిస్తుంది..పర్యటనలో భాగంగా మలేషియా ప్రతినిధులతో కలిసి మంత్రి నారాయణ అమరావతి నిర్మాణ పనులు జరుగుతున్న తీరును పరిశీలించారు...ఆ తర్వాత సచివాలయంలో వారితో భేటీ అయ్యారు...ఈ భేటీలో మలేషియాలోని సెలాంగార్ స్టేట్ ఎక్స్ కో మంత్రి పప్పారాయుడు,క్లాంగ్ ఎంపీ గనబతిరావ్,మలేషియా - ఆంధ్రా బిజినెస్ చాంబర్ ప్రతినిధులు,పలు ప్రయివేట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు..అమరావతి అభివృద్ధికి భారత్ తో కలిసి పనిచేస్తామని మలేషియా మంత్రి పప్పారాయుడు తెలిపారు...
ముఖ్యంగా మలేషియాలో తెలుగు మూలాలు ఉన్న పారిశ్రామిక వేత్తలకు చెందిన పలు కంపెనీల ప్రతినిధులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- తరువాయి 2లో..

# ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం...

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 15 వేల ఆర్థిక సాయం అందించే పథకానికి ఆమోదం**

**అమరావతి అభివృద్ధి పనుల వేగవంతానికి ఎస్‌పీవీ ఏర్పాటు**

**రాజధానిలో మిగిలిన భూముల సేకరణకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్**

**టెక్ హబ్‌ల ఏర్పాటుకు 'లిఫ్ట్' పాలసీకి అనుబంధ ప్రతిపాదనల ఆమోదం**

**ఈ నెల 16న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై మంత్రులకు దిశానిర్దేశం**

**రాష్ట్రంలో కారవాన్ టూరిజం పథకానికి మంత్రివర్గం ఆమోదం**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)


ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశం ముగిసింది. ఈ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేశారు. రాష్ట్రంలోని వివిధ వర్గాల సంక్షేమంతో పాటు రాజధాని అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు సుమారు 20 అజెండా అంశాలపై కేబినెట్ చర్చించి ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలు రాష్ట్ర ప్రగతికి మరింత ఊతమిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది.

**ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఆర్థిక అండ**

రాష్ట్రంలోని ఆటో, ట్యాక్సీ, క్యాబ్ డ్రైవర్లకు అండగా నిలుస్తూ రూ. 15,000 ఆర్థిక సాయం అందించే పథకానికి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గతంలో ఎదుర్కొన్న ఆర్థిక ఇబ్బందుల నుంచి డ్రైవర్లను ఆదుకునే లక్ష్యంతో ఈ పథకాన్ని తిరిగి ప్రారంభిస్తున్నారు. ఈ పథకాన్ని శనివారం విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య స్టేడియంలో ముఖ్యమంత్రి చంద్రబాబు లాంఛనంగా ప్రారంభించనున్నారు. "ప్రతి వర్గాన్ని ఆదుకోవడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ సాయం వారి జీవనోపాధికి భరోసా ఇస్తుంది" అని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయంతో లక్షలాది మంది డ్రైవర్లు లబ్ధి పొందనున్నారు.

**అమరావతి నిర్మాణానికి కీలక అడుగులు**

రాజధాని అమరావతి అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేందుకు కేబినెట్ రెండు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. మొదటిది, అమరావతిలో మౌలిక సదుపాయాలు, రోడ్లు, భవనాల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడానికి ఒక ప్రత్యేక ప్రయోజన సంస్థ (ఎస్‌పీవీ) ఏర్పాటుకు ఆమోదం



తెలిపింది. ఈ ఎస్‌పీవీ ద్వారా నిధుల సమీకరణ, పనుల పర్యవేక్షణ సులభతరం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. "అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలంటే ఎస్‌పీవీ ఏర్పాటు ఎంతో అవసరం. ఇది పనుల్లో వేగాన్ని, పారదర్శకతను పెంచుతుంది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దీంతో పాటు, ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాని మిగిలిన భూములను భూసేకరణ చట్టం ప్రకారం సేకరించేందుకు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

**టెక్నాలజీ, పర్యాటక రంగాలకు ప్రోత్సాహం**

రాష్ట్రంలో టెక్నాలజీ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ఉద్దేశించిన 'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ హబ్స్ (లిఫ్ట్)' పాలసీ 2024-29కి సంబంధించిన అనుబంధ ప్రతిపాదనలను కేబినెట్ ఆమోదించింది. ఇది ఐటీ, బయోటెక్ వంటి రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని ప్రభుత్వం పేర్కొంది. మరోవైపు, రాష్ట్రంలో పర్యాటకాన్ని కొత్త పుంతలు

- తరువాయి 2లో..



## రాష్ట్రంలో మరో కొత్త పథకానికి..
# కూటమి ప్రభుత్వ శ్రీకారం

- **ఆటో డ్రైవర్ సేవలో... పథకాన్ని రేపు ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు**
- **ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు**
- **సభకు హాజరుకానున్న ఉపముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

కూటమి ప్రభుత్వం సంక్షేమం దిశగా మరో అడుగు వేసింది. ఇప్పటికే పెద్దఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం....ఈ క్రమంలో డ్రైవర్ల సంక్షేమం కోసం 'ఆటో డ్రైవర్ సేవలో...' పథకానికి శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలోని సొంత ఆటో రిక్షా, మోటార్ క్యాబ్, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఆర్థికంగా అండగా నిలబడేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పథకం రూపొందించింది. ఈ పథకం కింద అర్హులైన డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇవ్వనున్నారు. ఈ పథకాన్ని శనివారం ముఖ్యమంత్రి

- తరువాయి 2లో..




## భారీ వర్షాలకు మృతుల కుటుంబాలకు
# రూ.4 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా

- **ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలకు నలుగురు మృతి**
- **సీఎం చంద్రబాబు ఉన్నత స్థాయి సమీక్ష**
- **దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ వెంటనే పునరుద్ధరించాలి**
- **పంటనష్టం అంచనా వేయండి**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉత్తరాంధ్ర జిల్లాల్లో భారీ వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ ను వెంటనే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో ఉత్తరాంధ్ర జిల్లాల్లో వర్షాలు, వరద ప్రవాహాలపై ఉన్నతాధికారులు, ఆయా జిల్లాల కలెక్టర్లతో సీఎం సమీక్ష నిర్వహించారు. సమీక్షకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల కలెక్టర్లు వీడియో కాన్ఫరెన్సు ద్వారా హాజరయ్యారు. ప్రస్తుతం ఆయా జిల్లాల్లో నెలకొన్న పరిస్థితులను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం గొట్టా బ్యారేజి, తోటపల్లి బ్యారేజీ పరిధిలో

- తరువాయి 2లో..




## పుష్కరాల నాటికి పోలవరం
# ప్రాజెక్టు పూర్తి చేయండి

**2026 జనవరి కల్లా ఎడమ కాలువ పనులు పూర్తి కావాలి**

**ఈ ఏడాది నవంబరు నుంచే ప్రధాన డ్యామ్ పనులు మొదలు పెట్టండి**

**పోలవరం ప్రాజెక్టుపై జల వనరుల శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలనే లక్ష్యంతో పనులు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను, కాంట్రాక్టు సంస్థలను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా లక్ష్యానికి అనుగుణంగా వేగంగా పనులు పూర్తి చేయాలని సీఎం సూచించారు. సచివాలయంలో శుక్రవారం పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. కేంద్ర జలసంఘం, నిపుణుల కమిటీ నుంచి ఎప్పటికప్పుడు ప్రాజెక్టు పనులపై అనుమతులు తీసుకుని పనుల్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ వద్దని ముఖ్యమంత్రి అధికారులకు సూచనలు జారీ చేశారు. డయాఫ్రం వాల్ మొత్తం 63,656 క్యూబిక్ మీటర్లకు గానూ 37,302 క్యూబిక్ మీటర్ల మేర పనులు పూర్తి అయ్యాయని అధికారులు వివరించారు. బట్రస్ డ్యామ్ పనులు వందశాతం పూర్తి అయినట్టు తెలిపారు.

- తరువాయి 2లో..

## ఉత్తరాంధ్ర వరద ప్రభావిత ప్రాంతాల్లో ..
# సమన్వయంతో పనిచేయండి..

- **ఉత్తరాంధ్ర వరద పరిస్థితిపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమీక్ష**
- **అధికారులకు కీలక ఆదేశాలు**
- **పారిశుద్ధ్య లోపం, తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని సూచన**
- **గ్రామాల్లో క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని స్పష్టం**
- **వరద ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు నివేదించాలని ఆదేశం**
- **ముంపు గ్రామాల ప్రజలను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడి**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఉత్తరాంధ్ర జిల్లాలను భారీ వర్షాలు, వరదలు ముంచెత్తుతున్న నేపథ్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అధికారులను అప్రమత్తం చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా, సురక్షిత మంచినీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్,

- తరువాయి 2లో..



## ఏపీలో ఇంటర్ పరీక్షల
# షెడ్యూల్ విడుదల

**ఫిబ్రవరి 23 నుంచి మార్చి 24 వరకు ఇంటర్ పరీక్షలు**

**జనవరి 27 నుంచే ప్రాక్టికల్ పరీక్షలు**

**ముందస్తు ప్రణాళిక కోసమే షెడ్యూల్ ప్రకటించినట్లు బోర్డు వెల్లడి**

**అవసరమైతే తేదీల్లో మార్పులు ఉండొచ్చని స్పష్టీకరణ**

**అధికారిక వెబ్‌సైట్‌లో పూర్తి టైమ్‌టేబుల్**

అమరావతి అక్టోబర్ 03 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్రప్రదేశ్‌లో 2026 సంవత్సరంలో జరగనున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు (%దీ×జూ్రా%) శుక్రవారం ప్రకటించింది. విద్యార్థులు పరీక్షలకు ముందుగానే ప్రణాళికతో సన్నద్ధమయ్యేందుకు వీలుగా ఈ షెడ్యూల్‌ను విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. ఇంటర్ పరీక్షలు 2026 ఫిబ్రవరి 23 నుంచి ప్రారంభమై మార్చి 24 వరకు కొనసాగుతాయి. విడుదల చేసిన టైమ్‌టేబుల్ ప్రకారం,




- తరువాయి 2లో..

## సంపాదకీయం

# అమెరికాలో షట్‌డౌన్ ట్రంప్ పుణ్యమే!

అమెరికా షట్‌డౌన్ గందరగోళంలో పడింది. ప్రతీ సంవత్సరం అక్టోబర్ 1న అమెరికా ఫెడరల్ ప్రభుత్వం కొత్త ఆర్థిక సంవత్సరాన్ని ప్రారంభిస్తుంది. ప్రభుత్వం నడపడానికి కావలసిన నిధులు చట్టసభ సభ్యులు (హౌస్ అండ్ సెనేట్) ఆమోదించకపోతే పరిస్థితి సంక్షోభంలో పడినట్టే. సాధారణంగా అమెరికా కాంగ్రెస్‌లోని ప్రధాన పార్టీలు అయిన రిపబ్లికన్స్, డెమొక్రాట్స్ మధ్య వివాదం తలెత్తినప్పుడు ఈ సమస్య ఏర్పడుతుంది. ఇలాంటి సమయంలో అమెరికా అధ్యక్షునికి, కాంగ్రెస్‌కు మధ్య ఒప్పందం కుదరకపోతే ప్రభుత్వానికి నిధులు లభించవు. ఇలాంటి సమయంలో ఖర్చులను తగ్గించుకోవడానికి అమెరికన్ ప్రభుత్వం షట్‌డౌన్ ప్రారంభిస్తుంది. ఈ సంవత్సరం బిల్లుల ఆమోదంలో రిపబ్లికన్లకు, డెమొక్రాట్లకు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడమే ప్రభుత్వాన్ని మూసివేయాల్సిన (షట్‌డౌన్) పరిస్థితికి దారి తీసింది. రిపబ్లికన్లు తాత్కాలిక నిధుల బిల్లును ప్రవేశపెట్టగా, డెమొక్రాట్లు ఆరోగ్య బీమా సబ్సిడీల పొడిగింపును కోరారు. ఆరోగ్య సంరక్షణకోసం వందల బిలియన్ డాలర్ల నిధులను పునరుద్ధరించాలని డెమొక్రాట్లు కోరుతున్నారు.

ఆరోగ్య బీమా అంశాన్ని బడ్జెట్ చర్చలనుంచి వేరుగా చర్చించాలని రిపబ్లికన్లు సూచించగా, డెమొక్రాట్లు అంగీకరించలేదు. ఏదైనా బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 60 ఓట్లు రావాలి. రిపబ్లికన్ల నుంచి 55 ఓట్లు వచ్చినప్పటికీ అవి సరిపోలేదు. దీంతో బిల్లులు వీగిపోయాయి. అలాగే డెమొక్రాట్లు ప్రతిపాదించిన మరో బిల్లు కూడా 47 53 తేడాతో వీగిపోయింది. దీంతో తాత్కాలిక నిధుల బిల్లు ఆమోదం పొందకపోవడంతో ట్రంప్ ప్రభుత్వం ఆర్థిక చిక్కుల్లోపడింది. దీంతో గడచిన ఆరేళ్లలో తొలిసారిగా షట్‌డౌన్‌ను ఎదుర్కొన్న 15వ ప్రభుత్వంగా ట్రంప్ పరిపాలన రికార్డుకెక్కనుంది. డెమొక్రాట్ల డిమాండ్లను కొన్నిటికి ట్రంప్ అంగీకరిస్తే షట్‌డౌన్‌ను నివారించవచ్చని సెనేట్ రిపబ్లికన్ నాయకుడు జాన్ థూన్ అభిప్రాయం వ్యక్తం చేశారు. ట్రంప్ విధానం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. షట్‌డౌన్ జరిగితే తన పాలనలో చాలా మంది ఫెడరల్ ఉద్యోగులను శాశ్వతంగా తొలగిస్తానని, అప్పుడు ఎక్కువ మంది డెమొక్రాట్లు ఉంటారని హెచ్చరికలు పదేపదే చేస్తుండడం సంచలనం కలిగిస్తున్నాయి.

ఈ షట్‌డౌన్ మొత్తం అమెరికా మీద విపరీత ఆర్థిక ప్రభావం చూపనుంది. అనేక ఫెడరల్ ఉద్యోగ సంస్థలు మూతపడనున్నాయి. పరిశోధనలు, ప్రయోగశాలల నుంచి చిన్న వ్యాపార సంస్థల వరకు ప్రతీదీ మూతపడుతుంది. ఇప్పటి అంచనాల ప్రకారం దాదాపు లక్ష మంది ఫెడరల్ ఉద్యోగులు తక్షణం రాజీనామా చేయవచ్చు. అంతేకాదు 7 లక్షల 50 వేల మంది సమాఖ్య కార్మికులను తొలగించే చర్యలు చేపట్టవచ్చు. ఫలితంగా అమెరికా ప్రభుత్వానికి ప్రతి రోజూ 400 మిలియన్ డాలర్లు ఖర్చవుతుంది. షట్‌డౌన్ కొనసాగితే ప్రతి వారానికి ఆర్థిక వృద్ధి 0.1 నుంచి 0.2 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీంతో 85% నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. పాస్‌పోర్ట్, వీసా, పబ్లిక్ మీడియా, ఆరోగ్యబీమా సబ్సిడీలు తదితర సేవలు తీవ్రంగా ప్రభావితం అవుతాయి. ఈసారి నిధుల వివాదంలో ఆరోగ్య సంరక్షణ సమస్య ప్రధాన అడ్డంకిగా మారింది.

ఈ సబ్సిడీలు ముగిస్తే దాదాపు 2.4 కోట్ల మంది అమెరికన్లకు ఆరోగ్య సంరక్షణ ఖర్చులు ఒక్కసారిగా పెరగనున్నాయి. జిడిపి, ఉద్యోగ గణాంకాలు, ద్రవ్యోల్బణ సూచికలు వంటి కీలక డేటా సేకరణలు నిలిపి వేయబడతాయి. ఫలితంగా మార్కెట్‌లో అనిశ్చితి పెరుగుతుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపనుంది. భారత్‌పై కూడా ఈ ప్రభావం పడుతుంది. ముఖ్యంగా భారత్ స్టాక్ మార్కెట్ల నుంచి అమెరికన్ ఇన్వెస్టర్లు తమ డబ్బులను వెనక్కు తీసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అప్పుడు విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కు తీసుకుంటే స్టాక్ మార్కెట్ బలహీనపడుతుంది. అలాగే డాలరుతో పోలిస్తే రూపాయి బలహీనపడే వీలుంది. ఎక్కువగా మన దేశానికి సంబంధించిన ఐటి కంపెనీలు అమెరికా లోని ప్రభుత్వ విభాగాల నుంచి కాంట్రాక్టులను పొంది సర్వీసులు అందిస్తుంటాయి. ఈ సర్వీసులకు సంబంధించిన బిల్లులు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. ఈ కారణంగా భారతీయ ఐటి రంగం కూడా అమెరికా షట్‌డౌన్ వల్ల తీవ్ర ప్రభావానికి గురయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.

ఈ షట్‌డౌన్ ఎంతకాలం కొనసాగుతుందో చెప్పలేం. గతంలో అమెరికా 1981 నుంచి ఇప్పటి వరకు 15 సార్లు షట్‌డౌన్‌ను ఎదుర్కొంది. అయితే ఇవన్నీ తక్కువ రోజుల్లోనే పరిష్కారమయ్యాయి. 2018 లో మాత్రం ట్రంప్ హయాంలో బోర్డర్ వాల్ డిమాండ్ కారణంగా 35 రోజుల పాటు షట్‌డౌన్ సాగింది. అమెరికా చరిత్రలో ఇప్పటిదాకా అయితే ఇది ఎక్కువ రోజుల షట్‌డౌన్ అని చెప్పవచ్చు. ట్రంప్ సర్కారు కన్నా ముందు రోనాల్డ్ రీగన్, బిల్ క్లింటన్, ఒబామా ప్రభుత్వాల కాలంలోనూ షట్‌డౌన్ పరిస్థితులు ఎదురయ్యాయి. బిల్‌క్లింటన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో 1995లో 21 రోజులపాటు షట్‌డౌన్ సాగింది. క్లింటన్ మొదటిసారి ప్రభుత్వ కాలంలో హౌస్‌తోపాటు సెనేట్‌లో కూడా రిపబ్లికన్లు ఆధిపత్యం ప్రదర్శించారు. భారీ బడ్జెట్‌ను పాస్ చేయాలని భావించారు. మెడికేర్ ఖర్చులను తగ్గిస్తూ ఇతర అంశాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఇబ్బంది వచ్చింది. బరాక్ ఒబామా ప్రభుత్వం 2013లో హెల్త్‌కేర్ బిల్లును వ్యతిరేకించడంతో 16 రోజుల పాటు షట్‌డౌన్ ఏర్పడింది. ఇప్పుడు కూడా ఆరోగ్య సంరక్షణ విషయమే వివాదం కావడం గమనార్హం.. రోనాల్డ్ రీగన్ దేశాధ్యక్షుడుగా రెండుసార్లు ప్రభుత్వాన్ని నిర్వహించారు. ఆయన హయాంలో ఎనిమిది సార్లు ప్రభుత్వం షట్‌డౌన్ అయింది.

# అరకు కాఫీకి ఛేంజ్ మేకర్ అవార్డుపై సీఎం చంద్రబాబు అభినందనలు

గిరిజన సహకార సంస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. అరకు వ్యాలీకి కాఫీకి ఫైనాన్షియల్ ట్రాన్స్‌ఫర్మేషన్ విభాగంలో అవార్డు దక్కడంపై గిరిజన శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, జీసీసీ ఎండీ కల్పన కుమారిని ముఖ్యమంత్రి ప్రశంసించారు. శనివారం సీఎం చంద్రబాబును మంత్రి సంధ్యారాణి, ఎండీ కల్పన కుమారి సచివాలయంలో కలిశారు. ఈ సందర్భంగా బిజినెస్ లైన్ నుంచి స్వీకరించిన అవార్డును, ప్రశంసా పత్రాన్ని సీఎం పరిశీలించారు. జీఐ ట్యాగ్ పొందిన తర్వాత అరకు కాఫీ అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ బ్రాండ్ గా మారిందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. ఏజెన్సీ ప్రాంతంలో సేంద్రీయ విధానంలో సాగు అవుతున్న అరకు కాఫీ స్వచ్ఛత, సువానలతో పాటు... ప్రత్యేక రుచిని కలిగి ఉందన్నారు. ఈ విశిష్టత కారణంగా అరకకు మంచి బ్రాండ్ అనే పేరు వచ్చిందని సీఎం చెప్పారు. కాఫీ సాగు ద్వారా అరకులోని గిరిజనుల జీవన శైలిలో మార్పు వచ్చిందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ఇటీవల జీసీసీ–టాటా కన్స్యూమర్ ప్రొడెక్ట్స్ లిమిటెడ్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంతో దేశంలో తొలిసారిగా ఆర్గానిక్ సాల్యూబుల్ కాఫీ ఉత్పత్తి కానుందని మంత్రి సంధ్యారాణి సీఎంకు వివరించారు. నర్సీపట్నం సమీపంలోని మాకవరపాలెం గ్రామంలో ఆధునిక సాంకేతికతతో కూడిన ఇంటిగ్రేటెడ్ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ద్వారా విలువ ఆధారిత ఉత్పత్తిగా బీన్ టు కప్ మోడల్ అభివృద్ధి కానుందని... తద్వారా అరకు కాఫీకి మరింత మార్కెట్ వస్తుందని మంత్రి సంధ్యారాణి వివరించారు.

## అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు మలేషియా కంపెనీల ఆసక్తి

ద్వారా తమ ప్రాజెక్ట్ ల గురించి మంత్రి నారాయణకు వివరించారు...ప్రధానంగా ఐదు కీలక సెక్టార్ లలో పెట్టుబడులు పెట్టేందుకు ఆయా కంపెనీలు ముందుకొచ్చాయి..ఎడ్యుకేషన్,టూరిజం – హాస్పిటాలిటీ,ట్రేడ్ అండ్ కామర్స్,రియల్ ఎస్టేట్(టెక్నాలజీ ట్రాన్స్ ఫర్,అభివృద్ధి,మౌలిక వసతులు కల్పన),తెలుగు సంస్కృతి,సంప్రదాయాలకు చెందిన వివిధ ప్రాజెక్ట్ ల్లో పెట్టుబడులకు ఆసక్తి కనబరిచారు.అమరావతిలో మెడికల్ యూనివర్శిటీ ఏర్పాటుకు మలేషియాలోని సైబర్ జయ యూనివర్శిటీ ముందుకొచ్చింది...అలాగే ఫైవ్ స్టార్ హెూటల్స్ ఏర్పాటుకు బెర్జయ(%దీజు=–జీశ్రీూ%) గ్రూప్ ముందుకొచ్చింది. లిప్రపంచంలో టాప్ 5 రాజధానుల్లో ఒకటిగా అమరావతి...మంత్రి నారాయణలి అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను మంత్రి నారాయణ మలేషియా ప్రతినిధులకు వివరించారు..ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ప్రణాళికాబద్దంగా అమరావతి నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు...ఇప్పటికే 51 వేల కోట్ల విలువైన పనులకు టెండర్లు పూర్తయి,పనులు కూడా ప్రారంభమయ్యాయని,నిర్ధేశిత గడువులతో నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామన్నారు..కేపిటల్ సిటీలో 360 కిమీ మేర ట్రంక్ రోడ్లు ఏడాదిన్నరోగా,1500 కిమీ మేర లే అవుట్ రోడ్లు రెండేళ్లలోగా,అధికారులు,ఉద్యోగులు,ప్రజాప్రతినిధులకు చెందిన 4000 ఇళ్లను వచ్చే మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలనే టార్గెట్ పెట్టుకున్నామన్నారు మంత్రి.అలాగే పాలనా భవనాలైన సచివాలయం టవర్లు,అసెంబ్లీతో పాటు హైకోర్టు భవనాలను రెండున్నరేళ్లలో పూర్తి చేసేలా టార్గెట్ పెట్టుకుని ముందుకెళ్తున్నామన్నారు.గత మూడు నెలలుగా వర్షాల వల్ల పనులకు కొంతమేర ఆటంకం కలిగిందని....రాబోయే రోజుల్లో పనులు వేగవంతం అవుతాయని మంత్రి నారాయణ మలేషియా బృందానికి వివరించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్,సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు,సీఆర్డీఏ అదనపు కమిషనర్ భార్గవ తేజ పాల్గొన్నారు.

## ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం...

తొక్కించేందుకు 'కారవాన్ టూరిజం' పథకానికి కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

**ప్రధాని పర్యటన, ఇతర నిర్ణయాలు**

ఈ నెల 16న ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో, ఏర్పాట్లపై కూడా కేబినెట్ భేటీలో చర్చించారు. కర్నూలులో జరగనున్న ఎన్‌డీఏ ర్యాలీ, జీఎస్టీ తగ్గింపుపై రాష్ట్రవ్యాప్తంగా 60 వేలకు పైగా అవగాహన సభలు నిర్వహించాలని మంత్రులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. వీటితో పాటు జలవనరుల శాఖ పరిధిలోని పలు పనులకు, అమృత్ 2.0 పథకం కింద 20 మున్సిపాలిటీలలో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయాలన్నీ 'సూపర్ సిక్స్' హామీల అమలులో భాగమేనని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# రాష్ట్రంలో మరో కొత్త పథకానికి..

## కూటమి ప్రభుత్వ శ్రీకారం

చంద్రబాబు ప్రారంభించనున్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ పరిధిలో ఉదయం 11 గంటలకు జరగనున్న ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరుకానున్నారు.

**2.90 లక్షల మందికి రూ.436 కోట్ల లబ్ది**

సొంత ఆటో, క్యాబ్ కలిగి వాటిపై ఆధారపడి జీవిస్తున్న వారి కోసం రూపొందించిన ఈ పథకానికి రాష్ట్రవ్యాప్తంగా 2,90,669 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించారు. వీరి కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.436 కోట్లను కేటాయించింది. ఈ నిధులను నేరుగా డ్రైవర్ల ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది. గత ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు కేవలం ఏడాదికి రూ.10 వేలు మాత్రమే ఇచ్చింది. కానీ కూటమి ప్రభుత్వం గత పాలకులకంటే 50 శాతం అదనంగా రూ.15 వేలు ఇస్తోంది. అలాగే గత ప్రభుత్వం ఈ పథకానికి కేవలం 2,61,516 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించి రూ.261.51 కోట్లే ఖర్చు పెట్టింది. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే కూటమి సర్కారులో లబ్ధిదారులు సుమారు 30 వేల మంది పెరిగారు.. అలాగే డ్రైవర్లకు రూ.175 కోట్లు అదనంగా లబ్ధి చేకూరుతోంది. కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకంలో ఆటో డ్రైవర్లు 2,25,621 మంది, త్రీ వీలర్ ప్యాసింజర్ వాహనాల డ్రైవర్లు 38,576 మంది, మోటార్ క్యాబ్ డ్రైవర్లు 20,072 మంది, మ్యాక్సి క్యాబ్ డ్రైవర్లు 6,400 మంది ఉన్నారు. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 22,955 మంది డ్రైవర్లకు లబ్ధి కలగనుంది.

**హామీ ఇవ్వకున్నా డ్రైవర్లకు లబ్ది**

వాస్తవంగా చూస్తే ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు అనే కార్యక్రమం పార్టీ మేనిఫెస్టోలో చెప్పలేదు. అయితే స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం అమలు నేపథ్యంలో ఆటో డ్రైవర్లకు సాయం అందించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రారంభిస్తోంది. ఏ ఒక్క లబ్ధిదారు నష్టపోకూడదని సిఎం స్పష్టం చేయడంతో గతానికంటే ఆర్థిక సాయం పెరగడంతో పాటు.. లబ్ధిదారుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా కూటమి ప్రభుత్వం వచ్చాక వాహనదారులకు మేలు కలిగించేలా పనులు చేపట్టింది. గత ప్రభుత్వంలో ఉన్న రోడ్ల దుస్థితి కారణంగా ఆటో డ్రైవర్లు, వాహనదారులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారు. గుంతల రోడ్ల కారణంగా ఆటోలు, ఇతర వాహనాలు దారుణంగా దెబ్బతినేవి. వీటి రిపేర్ల ఖర్చు తడిసిమోపెడు అయ్యేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సమస్య నుంచి గట్టెక్కించింది. రూ.1,000కోట్లు ఖర్చు చేసి రోడ్ల మరమ్మతులు చేపట్టి సాఫీగా ప్రయాణం సాగేలా చేసింది. అంతేకాకుండా పాతవాహనాలపై గత ప్రభుత్వం భారీగా వేసిన గ్రీన్ ట్యాక్స్‌ను కుదించింది. నాడు రూ.20 వేలు ఉన్న గ్రీన్ ట్యాక్స్ ను రూ.3 వేలకు తగ్గించి వాహనదారులకు పెద్దమొత్తంలో ఉపశమనం కలిగించింది. దీంతో ఆటోలు, క్యాబ్ లపై పెద్ద ఎత్తున భారం తొలగింది.

**ఫిర్యాదుల కోసం ప్రత్యేక వ్యవస్థ**

అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం అందేలా చేయాలని అధికారులకు ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వెళ్లాయి. అర్హత ఉండి కూడా జాబితాలో పేరు లేకుంటే... వారి సమస్యను పరిష్కరించిన వెంటనే లబ్ధిదారుల జాబితాలో చేర్చేందుకు ఏర్పాట్లు చేశారు. దీని కోసం ప్రత్యేకంగా ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రభుత్వం ఓ వ్యవస్థను ఏర్పాటు చేసింది. వాట్సాప్ ద్వారా ఒక ప్రత్యేక గ్రీవెన్స్ హ్యాండ్లింగ్ సిస్టమ్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. లబ్ధిదారులు తప్పనిసరిగా ఆంధ్రప్రదేశ్‌లో చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## భారీ వర్షాలకు మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా

భారీ ఎత్తున వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. గొట్టా బ్యారేజికి 1.89 లక్షల క్యూసెక్కులు, తోటపల్లికి 44 వేల క్యూసెక్కుల వరద వస్తోందని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ముఖ్యమంత్రికి వివరించారు. ఒడిశాలోని వేర్వేరు ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వంశధార నదికి 1.05 లక్షల క్యూసెక్కుల నీరు వస్తోందని తెలిపారు. భారీ వర్షాలు, ప్రమాదాల కారణంగా మురీడు జిల్లాల్లో నలుగురు మృతి చెందినట్టు అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. విశాఖ నగరం కంచరపాలెంలో ఒకరు, శ్రీకాకుళం జిల్లా మందసలో ఇద్దరు, పార్వతీపురం మన్యం జిల్లాలోని కురుపాంలో ఒకరు మృతి చెందినట్టు అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన సీఎం మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ప్రస్తుతానికి వర్షం లేదని... అయినా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహాలతో ఆయా నదుల్లో వరద ఉందని అధికారులు సీఎంకు వివరించారు. వర్షాలు, వరదల కారణంగా దెబ్బతిన్న రహదారులు, విద్యుత్తును వెంటనే పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో ఎక్కడా జాప్యం లేకుండా చూడాలని సీఎం సూచించారు. వరద కారణంగా నీట మునిగిన పంటను కూడా లెక్కించి పంట నష్టం అంచనాలను తయారు చేయాలన్నారు. అదే సమయంలో వర్షపు నీటిని సద్వినియోగం చేసుకునేందుకు గానూ రిజర్వాయర్లను నీటితో నింపాలని సూచించారు. ప్రజల ఇబ్బందులను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు.

# పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయండి

వైబ్రో కాంపాక్షన్ పనులు కూడా 74 శాతం మేర పూర్తైనట్టు సీఎంకు తెలియచేశారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పనులు పూర్తి కావాలని సీఎం స్పష్టం చేశారు. ప్రాజెక్టులో ప్రధాన డ్యామ్ ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్ పనుల్ని నవంబరు 1 నుంచే ప్రారంభించాలని.. 2027 డిసెంబరుకు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. పోలవరం కుడి కాలువను అనుసంధానించే సొరంగాల నిర్మాణం, ఎడమ కాలువకు అనుసంధానం చేసేలా అప్రోచ్ ఛానల్, హెడ్ రెగ్యులేటర్, ఇరిగేషన్ టన్నెల్, కేఎల్ బండ్ లను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ప్రధాన ఎడమ కాలువను 2026 జనవరి నాటికల్లా అనకాపల్లి వరకూ పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ, నిర్వాసితులకు పరిహార, పునరావాసాన్ని నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు.

**పోలవరం వద్ద పర్యాటక ఆకర్షణలు**

దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుగా నిర్మిస్తున్న పోలవరం వద్ద పర్యాటకులను ఆకర్షించేలా నిర్మాణాలు ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రాజెక్టు నుంచి భద్రాచలం, పాపికొండలు, దిగువన ధవళేశ్వరం వరకూ వివిధ ప్రాంతాలను అద్భుతంగా తీర్చిదిద్దాలన్నారు. పోలవరం ప్రాజెక్టు కనెక్టివిటీ కింద ఐకానిక్ రోడ్డు నిర్మించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. దీనిని జాతీయ రహదారికి అనుసంధానించేలా చూడాలన్నారు. రాజమహేంద్రవరం కేంద్రంగా పర్యాటకాన్ని అభివృద్ధి చేసేలా అఖండ గోదావరి ప్రాజెక్టును చేపట్టాలన్నారు. పోలవరం ప్రాజెక్టులో పనుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి ఆర్టీజీఎస్‌కు అనుసంధానించాలని సూచించారు. వచ్చే వర్షాకాల సీజన్‌లోగా వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ సమీక్షకు సీఎస్ కే.విజయానంద్, జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు, ఉన్నతాధికారులు హాజరయ్యారు.

## ఉత్తరాంధ్ర వరద ప్రభావిత ప్రాంతాల్లో ..

### సమన్వయంతో పనిచేయండి..

గ్రామీణాభివృద్ధి, రక్షిత మంచినీటి సరఫరా (ఆర్.డబ్ల్యూ.ఎస్.) శాఖల ఉన్నతాధికారులతో పవన్ కల్యాణ్ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఉత్తరాంధ్రలో తుపాను ప్రభావంతో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఆయనకు వివరించారు. ఒడిశా నుంచి వస్తున్న భారీ వరద ప్రవాహంతో వంశధార, నాగావళి నదులు ఉప్పొంగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా శ్రీకాకుళంలోని గొట్టా బ్యారేజీతో పాటు, వంశధార ప్రాజెక్టులోకి అంచనాలకు మించి వరద నీరు వచ్చి చేరుతోందని అధికారులు పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమాచారం అందుకున్న పవన్, సహాయక చర్యలపై పలు కీలక సూచనలు చేశారు. "వరద ప్రభావిత ప్రాంతాల్లోని గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్.డబ్ల్యూ.ఎస్. శాఖలు సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యల్లో పాలుపంచుకోవాలి" అని ఆయన నిర్దేశించారు. వరద తగ్గిన తర్వాత పారిశుద్ధ్య సమస్యలు తీవ్రంగా ఉంటాయని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అవసరమైతే సమీప జిల్లాల నుంచి పారిశుద్ధ్య సిబ్బందిని తరలించి, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ఆర్.డబ్ల్యూ.ఎస్. అధికారులపై ఉందని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో క్లోరిన్ కలిపిన సురక్షిత తాగునీటిని అందించాలని ఆదేశించారు. నీరు కలుషితం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ముంపునకు గురయ్యే గ్రామాల్లోని ప్రజలను జిల్లా యంత్రాంగం సురక్షిత ప్రాంతాలకు తరలించిందని అధికారులు సమావేశంలో వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న చర్యలు, క్షేత్రస్థాయి పరిస్థితులపై ఎప్పటికప్పుడు తన కార్యాలయానికి నివేదికలు పంపాలని పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు.


## ఏపీలో ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 23న, ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఫిబ్రవరి 24న మొదలవుతాయి. అన్ని పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని బోర్డు స్పష్టం చేసింది. సైన్స్, ఆర్ట్స్, కామర్స్ గ్రూపులకు సంబంధించిన పూర్తి సబ్జెక్టుల వారీగా టైమ్‌టేబుల్‌ను విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్ %ఎఅవ.ఖజూ.ప్రశీజ.అఅ% నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. థియరీ పరీక్షల కంటే ముందే ప్రాక్టికల్ పరీక్షలను పూర్తి చేయనున్నట్లు బోర్డు తెలిపింది. జనరల్ కోర్సుల విద్యార్థులకు ఫిబ్రవరి 1 నుంచి 10వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. వొకేషనల్ కోర్సుల వారికి మాత్రం జనవరి 27 నుంచి ఫిబ్రవరి 10 వరకు ప్రాక్టికల్స్ జరగనున్నాయి. వొకేషనల్ ప్రాక్టికల్స్ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు సెషన్లలో ఆదివారాలతో సహా నిర్వహిస్తామని పేర్కొంది. అయితే, ఇది కేవలం తాత్కాలిక షెడ్యూల్ మాత్రమేనని ఇంటర్ బోర్డు కార్యదర్శి డాక్టర్ నారాయణ భరత్ గుప్తా స్పష్టం చేశారు. ప్రభుత్వ సెలవులు లేదా ఇతర కారణాల వల్ల తేదీలలో మార్పులు చేసే అవకాశం ఉందని ఆయన తెలిపారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు తాజా సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను గమనిస్తూ ఉండాలని సూచించారు.

# తీరం దాటినా వీడని గండం... మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్

**ఒడిశాలోని గోపాల్‌పూర్ వద్ద తీరం దాటిన తీవ్ర వాయుగుండం**
**ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ**
**తీరం వెంబడి గంటకు 75 కి.మీ వేగంతో గాలుల హెచ్చరిక**
**ఎగువ వర్షాలతో శ్రీకాకుళం నదులకు భారీగా వరద**
**గొట్టా బ్యారేజ్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ**

తీవ్ర వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్ర అప్రమత్తమైంది. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తూ, ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరోవైపు, ఒడిశా రాష్ట్రంలో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీకాకుళం జిల్లాలోని ప్రధాన నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. విశాఖ వాతావరణ కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, తీవ్ర వాయుగుండం ఒడిశాలోని గోపాల్‌పూర్ సమీపంలో తీరాన్ని



దాటింది. ఇది క్రమంగా వాయవ్య దిశగా పయనిస్తూ బలహీనపడుతున్నప్పటికీ, దీని ప్రభావం ఇంకా కొనసాగుతుందని అధికారులు స్పష్టం చేశారు. రానున్న గంటల్లో తీరం వెంబడి గంటకు 55 నుంచి 75 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఒడిశాలో కురుస్తున్న కుండపోత వర్షాల వల్ల శ్రీకాకుళం జిల్లాలో వరద పరిస్థితి తీవ్రంగా మారుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వస్తున్న వరద నీరు వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్ర తనయ వంటి నదుల్లోకి చేరుతోంది. దీంతో వంశధార నదిపై ఉన్న హిరమండలం గొట్టా బ్యారేజీ వద్ద అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసి, నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అదేవిధంగా, నారాయణపురం ఆనకట్ట వద్ద కూడా నాగావళి నదిలో నీటి ప్రవాహం అంతకంతకూ పెరుగుతోందని అధికారులు తెలిపారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం-ఎమ్మెల్యే శిరీష దేవి



**రంపచోడవరం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** మౌళిక వసతులు కల్పనలో ప్రాధ్యానతాక్రమంలో అభివృద్ధికి తోడ్పాటు అందజేస్తున్నామని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషదేవి అన్నారు. మండలంలోని కిర్రాబు, ముల్లిమెట్ల గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు శుక్రవారం ఆమె శంకుస్థాపన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా నిర్మాణాలు పూర్తి నాణ్యతతో చేయాలని సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. నాణ్యత ప్రమాణాల్లో ఎలాంటి ఇబ్బందులు ఉన్నా స్థానిక నాయకులు తమ దృష్టికి తేవాలన్నారు. పంచాయతీ భవనం నిర్మాణం కొరకు పంచాయతీ రాజ్ విభాగం ఆర్ జిఎస్ఎ నుండి రూ:20 లక్షలు, ఎన్ఆర్ఈజిఎస్ నుండి రూ:12 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ముల్లిమెట్ల గ్రామంలో అంగన్వాడీ భవనం నిర్మాణం కొరకు పీఎం జనమన్ నిధులు రూ:12 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ఆయా నిర్మాణాలు కాల పరిమితిలోపు పూర్తి చేయాలన్నారు. ఆయాచోట్ల ప్రజలు పలు మౌళిక వసతులు కొరకు విన్నవించగా వినతులు స్వీకరించిన ఆమె సంభంధిత అధికారులతో నేరుగా మాట్లాడి ఆయా పనులు చేసి పురోభివృద్ధి నేరుగా తనకు తెలియజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు మరియు మౌళిక వసతుల విభాగం డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు, ఎఎంసి చైర్మన్ లోతా లక్ష్మణరావు, డైరెక్టర్లు కేసిరెడ్డి శివ, గట్టి మాణిక్యం, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు, దూసరపాము ఎంపీటీసీ నల్ల సత్తిబాబు, స్థానిక సర్పంచ్ బొర్రా బుజ్జమ్మ, నాగేంద్ర, గున్నయ్య, బీజేపీ మండలం అధ్యక్షులు తాము సూరిబాబు, జనసేన ప్రతినిధి బొదిరెడ్డి త్రిమూర్తులు, బారంగి అనుదీప్, ఎంపీడీఓ లోకుల యాదగిరీశ్వరరావు, ఐసిడిఎస్ సీడీపీఓ డి. సుజాత, పర్యవేక్షురాలు బి. అమ్మిరాజు, ఎంఈఓ సూరయ్యరెడ్డి, పంచాయతీ రాజ్ డిఈ పి. వెంకటరమణ, ఎపిఓ శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసి బిడ్డకి నూప ఫౌండేషన్ చేయూత





**కూనవరం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** తోగూడెం గ్రామానికి చెందిన గుండి దీపిక శ్రీ ఏపీ ఆర్ స్కూల్ కోతులగుట్ట గ్రామం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరం మండలం నందు పదో తరగతి చదువుతున్నది. ఆమెను కలిసిన సందర్భంగా తనకు చదువు పట్ల ఉన్న ఆసక్తిని గమనించి 10వ తరగతిలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని 1500 రూపాయల విలువ గల స్టడీ మెటీరియల్ (గైడ్లను) నూప పౌండేషన్ ద్వారా ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పౌండేషన్ అధ్యక్షులు నూప అనిల్ మాట్లాడుతూ విద్యార్థి దశ చాలా ప్రాముఖ్యమని ఈ దశలో చదువు మీద ఆసక్తి కనబరిచినట్లయితే భవిష్యత్తులో మంచి ఉన్నతస్థితిలోకి వెళ్లడంతో పాటు సమాజానికి సేవ చేసే అవకాశం కలుగుతుందని తెలియజేశారు. దసరా సందర్భంగా నూప ఫౌండేషన్ ద్వారా దీపిక శ్రీ కి (స్టడీ మెటీరియల్) గైడ్లు ఇవ్వటం చాలా సంతోషంగా ఉందని అలానే దీపిక శ్రీకి సరస్వతి కటాక్షం కలగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో దీపిక శ్రీ, తండ్రిగుండి లక్ష్మణ్, నూపా ఫౌండేషన్ అధ్యక్షులు నూప నరేష్ పాల్గొన్నారు.

## రౌడీ రాజకీయాలకు పెట్టింది పేరు కొట్టు

### -ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి

**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేకరి):**



ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా, హత్యా రాజకీయాలకు ఆద్యం పోసి, రౌడీయిజాన్ని పెంచి పోషించిన వ్యక్తిగా కొట్టు సత్యనారాయణ చరిత్రలో నిలిచిపోయారని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ ఘాటుగా విమర్శించారు. స్వచ్ఛభారత్ స్వచ్ఛ తాడేపల్లిగూడెం కార్యక్రమాన్ని స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథి బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ తాడేపల్లిగూడెంలో రౌడీయిజాన్ని మొదలుపెట్టింది కొట్టు సత్యనారాయణ అని ఘాటుగా విమర్శించారు. పని చేసే అధికారులను సైతం సొంత లాభాలకు వాడుకుని అవినీతి రాజకీయాలు చేసిన కొట్టు సత్యనారాయణ వంటి అవినీతిపరులు, రౌడీ నాయకులు నేడు నీతులు పలుకుతున్నారని ఎద్దేవాచేశారు. గత ప్రభుత్వ పాలనలో కొట్టు సత్యనారాయణ మున్సిపల్ పనులకు లంచాలు వసూలు చేస్తూ రౌడీ రాజకీయాలకు తెరలేపారన్నారు. ప్రజా అవసరాలను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులను తీసుకొచ్చి అవినీతికి పాల్పడటం వల్లే ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పి ఓడించారన్నారు. రోడ్లు వేసినందుకు, ఇల్లు కట్టుకుంటున్నందుకు, సైట్ వేసినందుకు సైతం డబ్బులు వసూలు చేసిన ఘనత వైసిపి నాయకులదని విమర్శించారు. మున్సిపాలిటీ వ్యవస్థను హస్తగతం చేసుకుని అవినీతికి పాల్పడిన ఘనత మాజీ ఎమ్మెల్యే కొట్టుదేనని ఘాటు విమర్శలు చేశారు. నిజ నిర్ధారణ కావాలంటే మున్సిపల్ ఆడిటింగ్ జరిపిస్తే అప్పటి అవినీతి అంతా బయటపడుతుందన్నారు. తన పాలనలో అధికారులు స్వచ్ఛందంగా పని చేస్తున్నారని వారికి సిబ్బంది సహకరించాలని తద్వారా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈబృహత్తర కార్యక్రమాన్ని ప్రజారోగ్య దృష్ట్యా నిర్విరామంగా నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ కార్మికుల సేవలను కొనియాడారు. భారతదేశ స్వతంత్రం సాధనకు కృషిచేసిన మహాత్మా గాంధీ ఆశయాల దిశగా ప్రస్తుత రాజకీయ నాయకులు అడుగులు వేయాలని వివరించారు. ముందుగా జాతిపిత గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ ఇంచార్జ్ ఈతకోట తాతాజీ, వర్తనపల్లి కాశీ తదితరులు

## జగదాంబ అమ్మ వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బాలరాజు





**జీలుగుమిల్లి, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా విజయదశమి పర్వదినం సందర్భంగా పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కుటుంబ సమేతంగా జీలుగుమిల్లి జగదాంబ అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఎల్లమ్మ గుడి వద్ద భవానీ మాల ధరించిన భవనీల ఇరుముళ్ళు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే తాటియాకులగూడెం లోని కనకదుర్గమ్మ ఆలయాన్ని దర్శించారు. ఎల్లమ్మ గుడి వద్ద నిర్వహించిన భవాని ఇరుముళ్ళు కార్యక్రమంలో అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మండల కేంద్రంలో కొలువైయున్న జగదాంబ అమ్మవారి ఆలయం వద్ద దేవీ నవరాత్రుల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రజలందరికీ జగదాంబ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉంటాయని, ఒకరోజు పండుగ చేయడం చాలా ఖర్చుతో కూడుకున్న పని అని అలాంటిది దసరా వేడుకలు ఇన్ని రోజులు ఘనంగా నిర్వహించిన జగదాంబ ఆలయ కమిటీ చైర్మన్ చిర్రి వెంకటేశ్వరరావుని ఎల్లమ్మ గుడి నిర్వాహకులు మూర్తి రాజు, కనకదుర్గమ్మ ఆలయ నిర్వాహకులు చోడిశెట్టి సత్య సూర్య ప్రసాద్, చోడిశెట్టి దుర్గా సుభాష్ లను అభినందించారు. అలాగే ఎల్లమ్మ గుడి వద్ద, కనకదుర్గమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పసుపులేటి రాము, కోలా ధర్మరాజు కొప్పుల దుర్గారావు, చిర్రి కృష్ణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడవాలి

### -ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేకరి):** స్వాతంత్ర్య సమరయోధులను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు వారి అడుగుజాడల్లో నడవాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి సూచించారు. జాతిపిత మహాత్మాగాంధీ, భారతరత్న లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సంస్థ ప్రాంగణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ దినేష్ శంకర్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలకులను ఎదిరించి, తెల్లదొరల వెన్నులో వణుకు పుట్టించిన మహనీయుల కృషి వెలకట్టలేనిదన్నారు. ఈ విజయదశమికి 100 వసంతాలు పూర్తి చేసుకున్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్, స్వయం సేవకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. భారత జాతి నిర్మాణంలోను, స్వాతంత్ర్య పోరాట ఉద్యమంలోను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కీలక పాత్ర పోషించిదని ప్రశంసించారు. స్వాతంత్ర్య ఫలాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. విభిన్న ఆలోచనలు చేస్తూ కొత్త కొత్త ఆవిష్కరణలు రూపొందించి ప్రపంచ యవనికపై భారత్ ఖ్యాతిని ఇనుమడింపజేయాలని సూచించారు. స్వాతంత్ర్య సమరయోధుల బోధనలు, సిద్ధాంతాలపై ప్రతి విద్యార్థి అవగాహనను పెంచుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలని వివరించారు. నిట్ తూర్పు ముఖద్వారం వద్ద నున్న మహాత్మా గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జి.రవికిరణ్ శాస్త్రి, ఆచార్యులు డాక్టర్ రాముడు, డాక్టర్ పులి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

### -శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్



**తాడేపల్లిగూడెం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేకరి):** గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములైతే రాష్ట్రం ప్రగతి పథంలో పయనిస్తోందని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పెంటపాడు మండలంలోని జట్లపాలెం, గూడెం మండలంలోని పడాల గ్రామాల్లో ఉపాధి హామీ 2.0 పథకం కింద మంజూరైన మినీ గోకులాలకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో తాడేపల్లిగూడెం మండల వ్యాప్తంగా ఇప్పటికే 600 మినీ గోకులంలను ఏర్పాటు చేసామని ప్రస్తుతం మరో 6 మినీ గోకులాలను ప్రారంభించనున్నామని తెలిపారు. కూటమి నాయకులు, గ్రామీణ ప్రజల భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పల్లెల అభివృద్ధితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని చెప్పారు. కూటమి నాయకులు ఈర్ష్య, ద్వేషాలను విడనాడి గ్రామాల అభివృద్ధికి చేయి చేయి కలిపి చేయూతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్తనపల్లి కాశి, పాలూరి వెంకటేశ్వరరావు, పుల్ల బాబి, ముత్యాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

### -సర్పంచ్ పిట్టా రామారావు



**వి ఆర్ పురం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** అల్లూరి సీతారామరాజు జిల్లా విఆర్ పురం మండలం లోని చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధిలో గోదావరి వరదల వలన పలు గ్రామాలలో వరి పంటలు నీట మునిగాయి, పొలాలను పరిశీలించిన స్థానిక సర్పంచ్ పిట్టా రామారావు ప్రభుత్వం రైతులకు అండగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా పిసా ఉప అధ్యక్షుడు కోటం జయరాజు మాట్లాడుతూ గోదావరి వరదలకు వరి పొలాలు నీట మునిగడంతో రైతులకు అపార నష్టం వాట్టిలిందని చెప్పారు. ఆర్థిక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన గ్రామాలయిన గుండుగూడెం, చింతరేగుపల్లి, పత్తిపాక కన్నాయిగూడెం, తూష్టివారిగూడెం, అడవి వెంకన్నగూడెం, రామవరం, సోమలగూడెం, లక్ష్మీ నగరం, కొపెల్లి, చొప్పెల్లి గ్రామాలు నీట మునిగాయని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోడిరామారావు, పాయం సత్యనారాయణ, పిట్టా శంకర్, సోడే రాముడు, సోడే సీతారామయ్య, సోడే రవి, మడివి దుర్గారావు, కోటం సురేష్, వరద భాదితులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచాన్ని మార్చే దీపధారులు ఉపాధ్యాయులు



**టి.నరసాపురం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన లావుడియా సాయి ప్రకాష్, భూక్యా ఆంజనేయులు, తేజావతు మౌనికలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు భూక్యా నాగరాజు నాయక్ మాట్లాడుతూ తరగతి నాలుగు గోడల మధ్య విద్యార్థులకు జ్ఞాన బోధ చేసి వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే దీపధారులు ఉపాధ్యాయులు అని అన్నారు. సంఘ నాయకులు జరభల కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ అన్ని వృత్తులలో ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనదని, క్రమశిక్షణ కలిగిన భావి భారత పౌరులను తీర్చి దిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. సంఘ జిల్లా నాయకురాలు భూక్యా నాగమణి మాట్లాడుతూ రవి అస్తమించని బ్రిటిష సామ్రాజ్యంపై సత్యం,. అహింస అనే ఆయుధాలతో పోరాడి భరత మాత దాస్యశృంఖలాలను విడిపించిన ప్రపంచ నేత మహాత్మా గాంధీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో భూక్యా వేణు గోపాల్, జరభల చందా నాయక్, భూక్యా భిగనాదం, సర్వేశ్వర రావు, ధృత్విక్ నాయక్ మొదలగు వారు పాలుగొన్నారు.

## స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

### -కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

**రాజమహేంద్రవరం, అక్టోబరు 3(తెలుగురాష్ట్రం ప్రతినిధి) :**



ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు నిచ్చిన స్వదేశీ వస్తువుల వాడకం పురస్కరించుకుని స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలని కేంద్ర భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ సూచించారు. స్థానిక సుబ్రహ్మణ్య మైదానంలో బిజెపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖాదీ సంతను కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ సందర్శించారు. అక్కడ స్టాల్స్ని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజులతో ఆయన కల్సి తిలకించారు. ఈసందర్భంగా అక్కడ ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖాదీ పరిశ్రమను ప్రోత్సహించడానికి మొదటి నుంచి ప్రధాని మోదీ చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. దేశం స్వయం సమృద్ధి సాధించాలని, ఆత్మనిర్భర్ భారత్, వికసిత్ భారత్ లక్ష్యాలతో ప్రధాని అడుగులు వేస్తున్నారని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించాలన్నారు. జిల్లా బిజెపి అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఖాదీ సంత కన్వీనర్ క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్, బిజెపి నాయకులు రేలంగి శ్రీదేవి, అడబాల రామకృష్ణ, రొంగలి గోపి, నర్శిపల్లి హారిక, కాలేపు సాయిరామ్, కరుటూరి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ జవ్వార్, అడబాల గణపతి, అడపా వరప్రసాద్, మద్దిపాటి రజిని, తదితరులు పాల్గొన్నారు. శుక్రవారం కూడా ఖాదీ సంత కొనసాగుతుంది. అలాగే ఖాదీ సంతను శుక్రవారం బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ సందర్శించారు. ఖాదీ వస్త్రాల ప్రోత్సహించాలని సూచించారు.

# పుష్కర పనుల ప్రతిపాదనలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



**రాజమహేంద్రవరం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) :** గోదావరి పుష్కరాలు-2027 నిర్వహణకు సంబంధించి నగరపాలక సంస్థ తరపున ప్రతిపాదనలను సహేతుకంగా రూపొందించి నివేదించాలని కలెక్టర్, కమిషనర్(ఎఫ్ఎసి) కీర్తి చేకూరి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. తొలుత 21 రహదారుల విస్తరణకు సంబంధించి రోడ్డు డెవలప్మెంట్ ప్లాన్‌ను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా ముందుగా కోరుకొండ రోడ్డు, ఈస్ట్ రైల్వే స్టేషన్ రోడ్డు, మోరంపూడి జంక్షన్ నుంచి శ్యామలా టాకీస్ వరకు రహదారి విస్తరణ పనులను చేపట్టవలసిన ఆవశ్యకత ఉందన్నారు. మంచినీటి సరఫరాకు సంబంధించి ప్రతీరోజు పరీక్షలు చేయాలని.. అలాగే ప్రైవేట్ వాటర్ ప్లాంట్‌ల వద్ద కూడా టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం పుష్కర పనులపై సమీక్షించారు. క్రౌడ్ మేనేజ్మెంట్, ఘాట్ల అభివృద్ధి, ట్రాఫిక్ మళ్లింపు, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపై రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌పై సమావేశంలో చర్చించారు. కేవలం పుష్కరాల పేరుతో తాత్కాలిక ఏర్పాట్లు చేయకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని నిర్ణయించారు. దీర్ఘకాలిక విధానంలో రహదారుల విస్తరణ, మౌలిక వసతుల కల్పన, పర్యాటకంగా నగరాన్ని అభివృద్ధి పరిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. గత పుష్కరాల దృష్ట్యా.. ఈసారి భక్తులకు సరిపడా వసతి సదుపాయాల కోసం పాఠశాలలు, కళ్యాణ మండపాలు, హోటళ్లు, గెస్ట్ హౌస్‌లు చూడాలన్నారు. అలాగే ప్రతి పుష్కర ఘాట్ వద్ద పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ పివి రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్ వెంకటరమణ, సెక్రటరీ జి శైలజ వల్లి, సిటీ ప్లానర్ జి కోటయ్య, సీపీఓ(రుడా) జీవీఎస్ఎన్ మూర్తి, ఎస్ఈ(ఇంఛార్జి) రీటా, ఈఈలు మదర్సా అలీ, మాధవి, రెవెన్యూ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్, సీఓసీ ఇంఛార్జి రవితేజ, అకౌంటెంట్ నాగమణి, సీఎంఎం రామలక్ష్మి, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అధికర్మయోగి పోగ్రాం ద్వారా గ్రామాల్లో సర్వే చేసేందుకు అధికారులు, సిబ్బంది

### -ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్



**రంపచోడవరం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** ఏజెన్సీలో ఎంపిక చేసిన ఆది కర్మయోగి ప్రోగ్రాం ద్వారా సర్వే చేసి నివేదికలు సమర్పించే విధంగా అధికారులను సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి స్మరణ్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం వై. రామవరం మండలం చవిటిదిబ్బలు గ్రామంలో ఆది కర్మయోగి గ్రామ సభకు ప్రాజెక్ట్ అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ అధికారి మాట్లాడుతూ ఏజెన్సీలోని బాగా వెనుకబడిన గ్రామాలలో వివిధ రకాలైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు కొరకు కేంద్ర ప్రభుత్వం ఆది కర్మయోగి ప్రోగ్రాం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ ఆది కర్మయోగి ప్రోగ్రాంలో విద్య, వైద్యము, రహదారులు, ఉపాది అవకాశాలు ఏర్పాటుకు తదితరవి సర్వే చేసి నివేదికల సమర్పించే విధంగా అధికారులను సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన అన్నారు. మొదట విడతగా 204 గ్రామాలను ఆది కర్మయోగి ప్రోగ్రాం గురించి ఎంపిక చేయడం జరిగిందని అదేవిధంగా ఈరోజు నుండి మరో 193 గ్రామాలను రెండో విడతగా గ్రామసభలు ప్రారంభమవుతాయని ఆయన అన్నారు. ఆది కర్మయోగి సర్వేకు వచ్చిన సిబ్బందికి అధికారులకు మీ మీ గ్రామాలలో సమస్యలు తెలియజేయాలని ప్రజలను కోరారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంతమంది అధికారులు ఉన్నది అదే విధంగా ఎంతమంది సిబ్బంది ఉన్నది ఆయన ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులకు వెంటనే వైద్య పరీక్షలు నిర్వహించి ఆయా వ్యాధులకు ఉచిత మందులు అందజేయాలని ఆయన అన్నారు. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఎంతమంది గర్భిణీ స్త్రీలు ఉన్నది ఎంతమంది బాలింతలు ఉన్నది అదేవిధంగా ప్రతిరోజు ఎంతమంది అవుట్ పేషెంట్స్ వచ్చుచున్నది ఆయన ఆరా తీశారు. వివిధ వ్యాధులకు సంబంధించిన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో పెట్టాలని ఆయన ఆదేశించారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించి ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నది, ఎంత మంది విద్యార్థులు ఉన్నది ముందుగా ప్రాజెక్ట్ అధికారి ఆరా తీశారు. విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన అన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారం ప్రతిరోజు మెనూ పక్కాగా అమలు చేయాలని అదేవిధంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఒకటికి రెండుసార్లు విద్యను బోధించాలని ఆయన అన్నారు. అదే విధంగా అంగన్వాడి కేంద్రమును ప్రాజెక్ట్ అధికారి పరిశీలించి బాల బాలికలకు విద్యపై దృష్టి పెట్టే విధంగా ఆటపాటలతో బాల బాలికలకు విద్యపై అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. అంగన్వాడి కేంద్రం పరిధిలో గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు ప్రభుత్వం ఏర్పాటు చేసే పౌష్టికాహారం అందజేయాలని ఆయన అన్నారు. అంగన్వాడి కేంద్రంలోని బాలబాలికలతో కాసేపు ముచ్చటించి మనబడి విద్యార్థులను ఎత్తుకున్నారు. విద్యార్థులకు తాజా తాజాగా ఆహార పదార్థాలు ప్రభుత్వ నిబంధన ప్రకారం అందజేయాలని ఆయన అన్నారు. అనంతరం వై. రామవరం మండలంలోని తోటకూరపాలెంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహమునకు శంకుస్థాపనలో ప్రాజెక్టు అధికారి పాల్గొని లబ్ధిదారులకు గృహ నిర్మాణ పనులు వేగవంతముగా చేయాలని ఆయన అన్నారు. అడ్డతీగల మండలంలోని పెనికేలపాడు గ్రామంలో మల్టీపర్పస్ భవనాన్ని ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ప్రాజెక్ట్ అధికారితో పాటు ఎంపీపీ కే. ఆనంద్, జడ్పిటిసి కె.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ జోగి రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఎడ్యుక్యూటివ్ ఇంజనీర్ ఐ. శ్రీనివాసరావు, సిడిపిఓ క్రాంతి, ఎంపీడీవో ఎం బాపన్న దొర, తహసిల్దార్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# తక్షణమే నిత్యావసర సరుకులు, నష్టపరిహారం అందించాలి

### -ఎంపీపీ లక్ష్మి, సర్పంచ్ బుచ్చమ్మ డిమాండ్



**వి ఆర్ పురం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** రామవరం పంచాయతీలో శుక్రవారం సిపిఎం ఆధ్వర్యంలో సమస్యలపై సిపిఎం బృందం తో పాటు ప్రజా ప్రతినిధులు ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ చేతుల మీదుగా సచివాలయ అధికారులకు మెమోరాండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు నెలలుగా వరదలు వస్తూపోతూ ఉండటంతో ప్రజలు పనులు లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బియ్యం, నిత్యవసర సరుకులతో పాటు విపత్తుల నష్టపరిహారం అందించాలని వారన్నారు. సెప్టెంబర్ నెల 20వ తారీకు నుంచి రహదారులు నిలిచిపోవడంతో భద్రాచలం వద్ద మూడో హెచ్చరిక దగ్గరలో వరద ప్రవహించిందని,రైతులు వరి పంట వేయటంతో వారం రోజులుగా పొలాలలో నుండి వరద తగ్గకపోవడంతో వరి కుళ్ళిపోయి పనికి రాకుండా పోయిందని రైతులు వారికి తెలపగా, అధికారులు వరి పొలాలను సర్వే చేసి నష్టం వివరాలను పై స్థాయి అధికారులకు తెలియపరచి నష్టపరిహారం అందించేలాగా కృషి చేయాలని, వరదల కారణముగా నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించాలని, ప్రతి కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులు, ఈ డ్రాపు చేసి రభి పంటకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, మరియు రెండవవిడత అన్నాధాత సుఖీభవః పథకమును అర్హులైన రైతు కుటుంబాలకు, స్థానిక వ్యవసాయ సహాయక అధికారి, స్థానిక వీఆర్వో స్వరవా తీసుకొని రైతులకు న్యాయం జరిగేలా చూడాలని, సిపిఎం పార్టీ జోన్ కమిటీ ఆధ్వర్యంలో అర్థగంట పాటు ధర్నా చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, వడ్లది రమేష్ నాయకులు కుంజా నాగిరెడ్డి, ఆసు. లక్ష్మయ్య, సుధీర్, రైతులు, గ్రామ ప్రజలు, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# తగ్గిన రేట్లకు అనుకూలంగా వస్తువులు విక్రయించాలి

### -ఎంపీడీఓ ఇమ్మానుయేల్, ప్రత్యేక అధికారి మురళి

**వి ఆర్ పురం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



విఆర్ పురం మండలంలో వస్తు సేవల పన్ను జీఎస్టీ తగ్గింపు మొదలైనది. కావున ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన జీఎస్టీ సవరణలతో ప్రజలకు కలిగే లాభాన్ని అధికారులు నాయకులు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. విఆర్ పురం మండలంలోని పెద్దమట్టపల్లి ప్రధాన రహదారిలో ఎంపీడీవో పి ఇమ్మానియేల్ మండల ప్రత్యేక అధికారి మురళి దుకాణాలు, ప్రజల వద్దకు దుకాణదారుల వద్దకు వెళ్లి జిఎస్టి సవరణ వల్ల వారు పొందే లబ్ధిని, వాటి ఫలాలు ప్రజల వరకు వస్తున్నాయా లేదా అని పెద్దమట్టిపల్లి పంచాయతీలోని ప్రజలతో మమేకమై వారి వివరణలు తీసుకోవడం జరిగింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జీఎస్టీ తగ్గించాయి కాబట్టి వ్యాపారులు వస్తువుల ధరలు, వ్యవసాయ పనిముట్ల ధరలు, తగ్గించి విక్రయించకపోతే జరిమానా తో పాటు చర్యలు తప్పవని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి. ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెట్టి లక్ష్మి, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పంచాయతీ కార్యదర్శులు, మండల ప్రజాపరిషత్ సిబ్బంది, దుకాణాదారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగుల ఆందోళన కార్యక్రమాలు..గోడ పత్రిక ఆవిష్కరణ..

**అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):**



రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె తీవ్రతరం చేసిన సందర్భంగా ది.06.10.2025 అనగా సోమవారం విశాఖపట్నంలో తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కార్పొరేట్ కార్యాలయం వద్ద ధర్నాకు పిలుపు ఇచ్చారు, అలాగే 8 తేదీన తిరుపతి కార్పొరేట్ కార్యాలయం మరియు 13 వ తేదీన జరిగే ఛలో విజయవాడ, 15 తేదీ నుంచి నిరవధిక సమ్మె ను విజయవంతం చేయాలని కోరారు. డిస్కమ్ జేఏసీ నేతలు భూక్యా నాగేశ్వరరావు, తురగా రామకృష్ణ మాట్లాడుతూ కంపెనీ పరిధిలోని అన్ని జిల్లాల ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.. ఈ సమావేశంలో జిల్లా నాయకులు యం.రమేష్, యస్ నరసింహారావు, పి.శ్రీనివాస్, కె.కృష్ణ కుమార్, జి.నాగేశ్వర రావు తదితర నాయకులు పాల్గొన్నారు..

# ఇకనుంచి ఆర్టీసీ బస్సులు అన్నీ కూడా మినీ బస్టాండ్ సెంటర్ లోనే ఆగాలి ఎమ్మెల్యే రోషన్ కుమార్ ఆదేశం.





**అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం విలేఖరి):** ఈరోజు శాసనసభ్యులు సొంగా రోషన్ కుమార్ చింతలపూడిలో మినీ బస్టాండ్ సెంటర్ ను పరిశీలించారు, ఆ సమయంలో ఆర్టీసీ బస్సు పాత బస్టాండ్ సెంటర్లో ఆగిన విషయం గమనించిన ఆయన ఆ బస్సు ఎక్కి డ్రైవర్ తో బస్సులన్ని కూడా మినీ బస్టాండ్ సెంటర్ లోనే నిలుపుదల చేయాలని సూచించారు మరియు ప్రయాణికులతో ఇకనుంచి మీరందరూ మినీ బస్టాండ్ సెంటర్ లోనే బస్సు ఎక్కడం,దిగటం చేయండి అని సూచిస్తూ, బస్సు లన్నీ కూడా మినీ బస్టాండ్ సెంటర్ లోనే ఆపాలని,ఆ విధంగా ప్రయాణికులకు అవగాహన కలిగించాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు.

# డిగ్రీ కళాశాల సాధించిన విద్యా ప్రధాత ఎమ్మెల్యే ఆనందరావును సత్కరించిన దళిత ఐక్యవేదిక



**అమలాపురం, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** అమలాపురంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు అవిరామంగా కృషిచేసి పేద వర్గాల విద్యార్థుల అభ్యున్నతి కొరకు పట్టుదలతో డిగ్రీ కళాశాల సాధించిన అమలాపురం శాసనసభ్యులు అయితా బత్తుల ఆనందరావు అహర్నిశలు అమలాపురం అభివృద్ధికి పాటుపడుతున్నారని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక నాయకులు ఆయన కృషిని కొనియాడారు ఎమ్మెల్యే ఆనందరావు సాధించిన డిగ్రీ కళాశాల పేద విద్యార్థులకు వరంగా మారిందని పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులందరికీ ఉపయోగపడుతుందని తెలిపారు శుక్రవారం ఎమ్మెల్యే ఆనందరావు ని అభినందిస్తూ దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో దుస్సాలువా కప్పి ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా జిల్లా దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబి లోక్ మాట్లాడుతూ విద్య యొక్క విలువ తెలిసిన ఎమ్మెల్యే ఆనందరావు పేద విద్యార్థులకు ఉన్నత విద్య కల్పించడానికి నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలను అమలాపురంలో ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు అమలాపురంలో అన్ని విధాల అభివృద్ధి చేయాలనే దృక్పథంతో అన్ని వర్గాలను కలుపుకొని అభివృద్ధి సాధకుడుగా ఎమ్మెల్యే ఆనందరావు ముందుకు వెళుతున్నారని అభినందిస్తూ అశోక విజయదశమి సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు అభివృద్ధి సాధనలో ఆయన చేస్తున్న కృషికి దళిత ఐక్యవేదిక ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేద వర్గాలకు విద్య వైద్య రంగాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ ఈ కార్యక్రమంలో జిల్లా దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబి లోక్ కన్వీనర్ జంగా బాబురావు కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు కోకన్వీనర్ పి డి ఎస్ యు విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు చల్లపల్లి సర్పంచ్ ఇసుక పట్ల జయమణి జంగా శ్రీను పాలమూరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# ‘ఐబొమ్మ’ హెచ్చరికలు ఎవరికి?




**హైదరాబాద్, అక్టోబర్ 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి):** సినిమా పైరసీ వెబ్‌సైట్ ఐబొమ్మ తెలంగాణ పోలీసులకు హెచ్చరికలు జారీ చేసి, గోప్యమైన ఫోన్ నంబర్లను లీక్ చేస్తామంటూ బెదిరించిందన్న వార్తలను తెలంగాణ ప్రభుత్వం ఖండించింది. దీనిపై వచ్చిన ప్రచారం అవాస్తవమని తెలంగాణ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ‘ఎక్స్’లో ఓ పోస్టు పెట్టింది. “పలు మీడియా కథనాలు, సోషల్ మీడియాలో ప్రసారమైన పోస్టుల ప్రకారం.. సినిమా పైరసీ సైట్ iBomma తెలంగాణ పోలీసులకు హెచ్చరికలు చేసి, గోప్యమైన ఫోన్ నంబర్లను లీక్ చేస్తామని బెదిరించినట్లు పేర్కొన్నాయి. ఇలా ప్రసారం అవుతున్న స్క్రీన్‌షాట్‌లు 2023 నాటివి. అవి పోలీసులను ఉద్దేశించినవి కాదు.. తెలుగు సినిమా పరిశ్రమకు సంబంధించినవి. తెలంగాణ పోలీసులకు ఎలాంటి బెదిరింపులు రాలేదని తెలియజేస్తున్నాం. ప్రజలు సోషల్ మీడియాలో పోస్టు చేసే, షేర్ చేసే విషయాల్లో జాగ్రత్తగా ఉండాలని మనవి” అని పేర్కొంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక

ఉభయ గోదావరి

https://epaper.teluguraastram.com

అమలాపురం
అక్టోబర్ 04,
శనివారం 2025



# సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ , వర్తకులు, వినియోగదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి

**-ఈనెల 4వ తేదీన 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమం ప్రతీ నియోజకవర్గంలో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలి-ఈనెల 6వ తేదీన స్వచ్ఛంద్ర అవార్డుల కార్యక్రమం నిర్వహణకు ఏర్పాట్లు చేయాలి-అధికారులతో జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి టెలి కాన్ఫరెన్స్**




ఏలూరు, అక్టోబర్, 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి): సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఎంఎస్ఎంఈ , వర్తకులు, వినియోగదారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుండి శుక్రవారం సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో రెండవ వారం చేపట్టాల్సిన కార్యక్రమాలు, ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం నిర్వహణాలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజలు వినియోగించే నిత్యావసర సరుకులపై ఏ మేరకు జీఎస్టీ తగ్గింపుతో ఏ మేరకు లబ్ది కలుగుతుందో ప్రతీ కుటుంబానికి తెలియజేయాలన్నారు. ఇందుకోసం ప్రచురించిన కరపత్రాలను గ్రామ/వార్డ్ సచివాలయ స్థాయిలో ప్రతీ కుటుంబానికి అందించి, జీఎస్టీ 2.%ఉ% కింద ఏ వస్తువుపై ఏ మేరకు తగ్గింపు వర్తిస్తుందో తెలియజేసి, వారు వినియోగించుకునేలా అవగాహన కలిగించాలన్నారు. సూపర్ జీఎస్టీ... సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై జిల్లాలో నాలుగు వారాల పాటు ప్రతీ వారం ఒక థీమ్ తీసుకుని ప్రజలకు అవగాహన కలిగించడం జరుగుతున్నదని, మొదటివారం ఇంట్లో వినియోగించే నిత్యావసర వస్తువులు ధరల పొదుపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. రెండవ వారంలో నిర్వహించాల్సిన అవగాహన కార్యక్రమాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తిచేయాలని, రెండవ వారంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక రంగాలపై జీఎస్టీ సంస్కరణలపై ఎంఎస్ఎంఈ , వర్తకులు, వినియోగదారులతో మండల, నియోజకవర్గ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రత్యేక షాపింగ్ మేళాలు నిర్వహించేలా ఎంపిడిఓలు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 4వ తేదీన ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమం ఘనంగా నిర్వహించాలి ఈనెల 4వ తేదీన 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమం రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ప్రారంభించనున్న దృష్ట్యా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఘనంగా పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి కనీసం 500 మంది లబ్ధిదారులు కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేయాలనీ, ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలన్నారు. ఈనెల 6వ తేదీన 'స్వచంద్ర అవార్డు' ల కార్యక్రమానికి పటిష్టమైన ఏర్పాట్లు చేయాలి స్వర్ణాంధ్ర.. స్వచంద్ర కార్యక్రమంలో జిల్లాకు రెండు రాష్ట్ర స్థాయి అవార్డులు, జిల్లా స్థాయిలో 51 అవార్డులు లభించాయన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే అవార్డుల ప్రధానం కార్యక్రమానికి జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యులు, జిల్లా మంత్రివర్యులు, పలువురు ప్రజాప్రనిధులు హాజరయ్యే అవకాశం ఉన్నందున కార్యక్రమం నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలనీ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా రెవిన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమీషనర్ నాగార్జునరావు, జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. (జిల్లా సమాచార శాఖ, ఏలూరు జిల్లా, ఏలూరు వారిచే జారీ చేయబడినది)

## ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం

# ఘనంగా నిర్వహించాలి

## జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మచిలీపట్నం అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) ఈనెల 4 వ తేదీన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమంపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సజావుగా ఏర్పాట్లు చేయాలని దిశా నిర్దేశం చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూఈ నెల 4 వ తేదీన ఉదయం 11 గంటలకు విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి అనుగుణంగా, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో సంబంధిత శాసనసభ్యులతో సమన్వయం చేసుకుని నిర్వహించాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొనేలా ఆహ్వానం పంపాలన్నారు.లబ్ధిదారుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయి కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారం కోసం పెద్ద ఎల్ఈడి స్క్రీన్లు ఏర్పాటు చేసి, అన్ని నియోజకవర్గాల కార్యక్రమాలను సమన్వయం చేయాలన్నారు. అధికారులందరూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమన్వయంతో కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.ఈ టెలి కాన్ఫరెన్స్ లోమ ఆర్డీవో ఎన్ శ్రీనివాస్, డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, డిఎల్ డివోలు, పలువురు రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల ధర్నా



మచిలీపట్నం అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు తమ హక్కుల కోసం శుక్రవారం కృష్ణాజిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల న్యాయపరమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. జీవో 99 ద్వారా కోత విధించిన ఇన్ సర్వీస్ పీజీ కోటా ను పునర్ధరచాలని కోరారు. ట్రైబల్ అలవెన్స్, 104 సంచార చికిత్స అలవెన్స్, నోషనల్ ఇంక్రిమెంట్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ దీప్తి ( మోటూరు పి హెచ్ సి) జనరల్ సెక్రెటరీ డాక్టర్ చరణ్ తేజ్ ( నిమ్మకూరు పీ హెచ్ సి) డాక్టర్ నిరీక్షణ, తేజ తదితరులు పాల్గొన్నారు.

# అయితా ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ అండ్ డెవలపర్స్ పేరుతో నూతన వ్యాపారాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తనయుడు కరణ్









అక్టోబర్, 3 (తెలుగురాష్ట్రం ప్రతినిధి): అయితా ఇన్ఫ్రా ప్రాజెక్ట్స్ అండ్ డెవలపర్స్ పేరుతో నూతన వ్యాపారాన్ని ప్రారంభించి స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీ నందు మొదటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తనయుడు కరణ్ . ఈ సందర్భంగా అయితా ఇన్ఫరా బిల్డర్స్ అండ్ కన్స్ట్రక్షన్ సంస్థ ద్వారా నిర్మాణ రంగంలో అడుగుపెట్టిన కరణ్ గారిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ హరీష్ మాధుర్, మెట్ల రమణ బాబు, అల్లాడ స్వామి నాయుడు, చిక్కాల గణేష్, గంధం పల్లంరాజు, అల్లాడ శరత్ బాబు, దేశం శెట్టి లక్ష్మీ నారాయణ, మండేల బాబీ, బోనం సత్తిబాబు, ఆశెట్టి ఆదిబాబు, మట్ట ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు













# వ్యవసాయ రంగ ప్రగతికి అగ్రి ల్యాబ్ దోహదపడుతుంది!





ఉండి అక్టోబర్ 01 (తెలుగురాష్ట్రం ప్రతినిధి) వ్యవసాయ రంగ ప్రగతికి అగ్రీ టెస్టింగ్ ల్యాబ్ ఎంతగానో దోహదపడుతుందని దీనిని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణంరాజు రైతులకు సూచించారు. ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డులో రాష్ట్ర ప్రభుత్వం 85 లక్షల రూపాయల వ్యయంతో అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ను నూతనంగా ఏర్పాటు చేశారు. దానిని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘు రామ కృష్ణంరాజు, జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చేతుల మీదగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ రైతాంగం ఎరువులు నాణ్యత విత్తనాల నాణ్యత ఉచితంగా పరీక్షించేందుకు ఇక్కడ లేబరేటరీ దోహదపడుతుందని దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకొని అధిక ఉత్పత్తుల సాధించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన డ్రోన్ ఎగ్జిబిషన్ మినీ ట్రాక్టర్లు పరిశీలించారు జిఎస్టి తగ్గించిన తర్వాత తగ్గించక ముందు రేట్లు విద్యాసాన్ని కూడా అక్కడ డిస్ప్లే చేసి రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో జెసి రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో ప్రవీణ్ కుమార్ రెడ్డి గ్రామపంచాయతీ సర్పంచ్ కమతం సౌజన్య బెనర్జీ మార్కెట్ కమిటీ చైర్మన్ కలిదిండి శ్రీనివాసరాజు వ్యవసాయ శాఖ జి డి ఏ తో పాటు ఏ డి ఏ, ఏ ఓ ఇతర సిబ్బంది సాంకేతిక నిపుణులు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉభయ గోదావరి
https://epaper.teluguraastram.com
తెలుగురాష్ట్రం
దినపత్రిక

# పాక్ కుట్రలకు టార్గెట్.. రాణ్ ఆఫ్ కచ్..!

కరాచీ : పాకిస్థాన్ సర్ క్రీక్ వద్ద దుస్సాహసాలకు పాల్పడితే.. కరాచీ ప్రాంతం దద్దరిల్లుతుందని దసరా నాడు రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించడం సంచలనం సృష్టించింది. రక్షణ మంత్రి వద్ద ఏ సమాచారం లేకుండా అలా మాట్లాడరన్నది సుస్పష్టం. గత చరిత్రను పరిశీలిస్తే పాక్ ఇక్కడ దుస్సాహసాలకు పాల్పడిన చరిత్ర ఉంది. ఇదొక్కటే కాదు.. గుజరాత్‌లోని జూనాగఢ్‌పై కూడా పాక్ కన్నేసింది.



### గతంలో కొత్త ఆయుధ పరీక్షా కేంద్రంగా మార్చిన పాక్..

పాకిస్థాన్‌కు 1965 నాటికి అమెరికా కూటమి సెంటో ఆశీస్సులతో అత్యాధునిక ఎఫ్-86ఎఫ్ సేబర్ జెట్లు, ఎం47, ఎం48 పట్టాన్ ట్యాంక్‌లు సహా పలు ఆయుధాలను సమకూర్చుకొంది. మరోవైపు భారత్ తీవ్రమైన కరవు, 1962లో చైనాతో యుద్ధంలో ఎదురుదెబ్బలతో ఇబ్బందిపడుతోంది. దీంతో తన అత్యాధునిక ఆయుధాలు వాడి భారత్ భూభాగాలను ఆక్రమించాలనే దుర్బుద్ధి పుట్టింది. తొలుత భారత్ శక్తిని అంచనా వేయడానికి ఓ పరీక్షలాగా 1965 ఏప్రిల్‌లో ఆపరేషన్ డిజర్ట్ హాక్ పేరిట రాణ్ ఆఫ్ కచ్‌లోకి పాక్ దళాలు దూసుకొచ్చాయి. భారత్ సైన్యం భీకరంగా ఎదురుదాడి చేసింది. చివరికి యూకే మధ్యవర్తిత్వంతో యథాతథస్థితిని నెలకొల్పారు. ఆ తర్వాత కొన్ని నెలలకే ఆపరేషన్ జిబ్రాల్టర్ పేరిట కశ్మీర్‌ను ఆక్రమించుకొనేందుకు దాడి చేసి ఘోరంగా పరాజయం పాలైంది. కానీ, ఈ యుద్ధంలో రాణ్ ఆఫ్ కచ్ వద్ద గుజరాత్ ముఖ్యమంత్రి బల్వంత్‌రాయ్ మెహతా ప్రయాణిస్తున్న బీచ్‌క్రాఫ్ట్ విమానాన్ని పాక్ జెట్‌లు కూల్చేశాయి.

సర్‌క్రీక్‌పై పాకిస్థాన్ ఎప్పటినుంచో కన్నేసింది. ఆ దేశ నౌకాదళానికి చెందిన బ్రెగ్వేట్ అట్లాంటిక్ విమానం 1999లో సరిహద్దులు దాటి సర్‌క్రీక్‌పై ప్రయాణించింది. నాడు భారత్‌కు చెందిన మిగ్-21 జెట్ దానిని కూల్చేసింది. ఈ ఘటనలో 16 మంది పాక్ నేవీ అధికారులు మరణించారు. కార్గిల్ ముగిసిన కొన్ని నెలల్లోనే ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఆ తర్వాత పాక్ మెరైన్ యూనిట్లను ఇక్కడికి తరలించింది. అదే ఏడాది భారత మిగ్‌పై ఓ క్షిపణిని ప్రయోగించింది. కానీ, నాడు మన జెట్ దానిని సురక్షితంగా తప్పించుకొంది.

2020లో గుజరాత్‌లోని జూనాగఢ్ కూడా తమదే అంటూ పాక్ కొత్త వాదనను తెర పైకి తెచ్చింది. దీనికి అనుకూలంగా నాటి ఇమ్రాన్ సర్కారు తమ దేశ మ్యాప్‌లో ఆ ప్రాంతాన్ని చూపించడం మొదలుపెట్టింది. స్వాతంత్ర్యం లభించిన కొత్తల్లో జూనాగఢ్ సంస్థానాన్ని తమలో విలీనం చేసుకోవాలని పాక్ తీవ్రంగా ప్రయత్నించిన విషయం తెలిసిందే.

2019 నుంచి పాక్ సర్‌క్రీక్ వద్ద భారీగా సైనిక మోహరింపులు చేపడుతోందని మీడియా కథనాలు వెలువడ్డాయి. వీటిల్లో ఇన్‌ఫాంట్రీ, యాంఫీబియస్ బెటాలియన్లు, నిఘా కోసం కోస్టల్ డిఫెన్స్ బోట్లు, ఎయిర్‌డిఫెన్స్ యూనిట్లు వంటి వాటిని ఇక్కడికి తరలించింది.

గుజరాత్ రాష్ట్రంలో సర్‌క్రీక్ రేఖ 96 కి.మీ. పొడవు, 1-3 కి.మీ. వెడల్పుతో వివాదాస్పద సరిహద్దు రేఖగా ఉంది. సర్‌క్రీక్ అనేది అనిశ్చల అలల ప్రాంతం. తరచూ తన ఉనికిని మారుస్తుంది. పాకిస్థాన్ సర్‌క్రీక్‌ను అంగీకరిస్తూనే ఆ రేఖ తూర్పుతీరానికి సరిహద్దుగా గుర్తించాలని వాదిస్తోంది. భారత్ మాత్రం దాని మధ్యభాగం నుంచి సరిహద్దు గుర్తించాలని చెబుతోంది. అందుకు కారణం అధిక ఆటుపోటుల కాలంలో ఈ క్రీక్ నౌకాయానానికి అనుకూలంగా ఉంటుందని భారత్ భావిస్తోంది. వాస్తవానికి ఈ ప్రదేశం మొత్తం బురద నేలలతో ఉండటం వల్ల సైనికులు దాడులకు పాల్పడటం కొంత కష్టమే. ఇక్కడ చమురు నిల్వలు ఉండే అవకాశాలు ఉండటంతో దీనికి ప్రాధాన్యం పెరిగింది. అంతేకాదు.. సముద్ర సరిహద్దుల నిర్ధరణ, ఎక్స్‌క్లూజివ్ ఎకనామిక్ జోన్‌పై దీని ప్రభావం పడుతుంది. దాదాపు 96 కిలోమీటర్ల పొడవున్న సర్‌క్రీక్‌పై ఎన్నిసార్లు చర్చలు జరిపినా సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడలేదు.

పాకిస్థాన్ అతిపెద్ద పోర్టు నగరమైన కరాచీ ప్రాంతం సర్‌క్రీక్‌కు నైరుతి దిశలో ఉంటుంది. ఈ ప్రాంతంపై పట్టు సాధిస్తే కరాచీకి భద్రత లభిస్తుందని పాక్ భావిస్తోంది. ఎందుకంటే సర్ క్రీక్ నుంచి జల మార్గాల మీదుగా కరాచీ రేవుకు చేరుకోవచ్చు.

# విజయ్ పార్టీకి మద్రాస్ హైకోర్టులో చుక్కెదురు

**కరూర్ : టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన ప్రచార ర్యాలీ తీవ్ర విషాదాన్ని నింపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కోరుతూ విజయ్ పార్టీ వేసిన పిటిషన్‌ను మద్రాస్ హైకోర్టు తోసిపుచ్చింది. విజయ్ పిటిషన్‌కు సంబంధించి శుక్రవారం మదురై బెంచ్ విచారణ జరిపింది. ఈసందర్భంగా ధర్మాసనం విజయ్ పార్టీపై ఆగ్రహం వ్యక్తంచేసింది. కరూర్ ఘటనపై పోలీసుల దర్యాప్తు ఇంకా ప్రారంభదశలోనే ఉన్న విషయాన్ని గుర్తుచేసింది. ఈక్రమంలోనే సీబీఐ దర్యాప్తు కోరడం సరికాదని పేర్కొంది. ఈ సందర్భంగా కోర్టులను రాజకీయ వేదికలుగా మార్చవద్దని వ్యాఖ్యానించింది. సీబీఐ దర్యాప్తు కోరుతూ భాజపా న్యాయవాది జీఎస్ మణి దాఖలు చేసిన పిటిషన్‌ను కూడా కొట్టివేసింది.**



ఇక, విచారణ సందర్భంగా రాజకీయ పార్టీలకు కోర్టు కీలక సూచనలు చేసింది. భవిష్యత్తులో నిర్వహించే బహిరంగ సభలు, సమావేశాల్లో తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు, అంబులెన్స్ సేవలు, నిష్క్రమణ మార్గాలు వంటి ప్రాథమిక సౌకర్యాలు కల్పించాలని పేర్కొంది. ప్రజల ప్రాణాల రక్షణకే తొలి ప్రాధాన్యం ఇవ్వాలని వెల్లడించింది. ఈక్రమంలో ప్రామాణిక నిర్వహణ విధాన నిబంధనలు (%ాఉూ%) రూపొందించే వరకు హైవేలపై ఏ రాజకీయ పార్టీ సభలకు పోలీసులు అనుమతివ్వరని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది.

మరోవైపు.. ముందస్తు బెయిల్ కోరుతూ టీవీకే నామక్కల్ జిల్లా కార్యదర్శి సతీష్‌కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టివేసింది. ర్యాలీ సమయంలో జన సమూహాన్ని నియంత్రించడంలో పార్టీ ఎందుకు విఫలమైందని న్యాయమూర్తి ప్రశ్నించారు. తొక్కిసలాట బాధితులకు అదనపు పరిహారం కోరుతూ మరో పిటిషన్ దాఖలైంది. దీనిపై స్పందన కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది.

### విజయ్‌పై డీఎంకే ఆరోపణలు..

తొక్కిసలాటపై ఇటీవల విజయ్ తనను ఏదైనా చేయండి కానీ, ప్రజల జోలికి వెళ్లొద్దంటూ సీఎం స్టాలిన్ లక్ష్యంగా కీలక వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై అధికార డీఎంకే పార్టీ గట్టిగా స్పందించింది. సినిమాల్లో మాదిరిగానే నిజ జీవితంలో కూడా విజయ్ నటన విఫలమైందంటూ పార్టీకి చెందిన వార్తా పత్రిక తన సంపాదకీయంలో విమర్శలు చేసింది. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఇప్పటికే పరిహారం చెల్లించిందని, కానీ.. విజయ్ ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టింది. తనను అరెస్టు చేయాలంటూ సవాలు విసురుతూ.. 41 మంది మరణించిన అంశాన్ని దారి మళ్లించేందుకు విజయ్ ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. తొలుత డిసెంబరు 13న షెడ్యూల్ చేసిన పర్యటనను ముందుకు జరపడంపై పలు అనుమానాలు వ్యక్తంచేసింది.

# ఏఐకి వీడియో గేమ్స్ నేర్పడానికి.. ఉద్యోగులను నియమించుకుంటున్న గ్రోక్

**ఢిల్లీ : ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ అంకుర సంస్థ ఎక్స్‌ఏఐ గ్రోక్ ఏఐ చాట్‌బాట్ సేవల్ని అందిస్తున్న సంగతి తెలిసిందే. గ్రోక్‌కు వీడియో గేమ్‌లపై శిక్షణనివ్వడానికి మస్క్ సంస్థ ఉద్యోగులను నియమించుకోవడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. వీడియో గేమ్‌ల కోసం నియమించుకొనే ట్యూటర్‌లు గ్రోక్‌కు గేమ్‌లు రూపొందించడం, కథలను డిజైన్ చేయడం, యూజర్‌ల ఆలోచనా వైఖరి.. అభిరుచులు వంటి విషయాలపై ఎక్స్‌ఏఐ గ్రోక్‌కు శిక్షణనివ్వనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.**




గ్రోక్‌ను టెక్స్ట్-ఆధారిత సంభాషణకు మాత్రమే పరిమితం చేయకుండా సృజనాత్మకంగా ఆలోచించి.. ఆకర్షణీయమైన వీడియో గేమ్‌లను రూపొందించగలిగే సామర్థ్యాన్ని పెంచడానికి మస్క్ సంస్థ ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఏఐకు శిక్షణనివ్వడానికి కంపెనీ గేమ్ డిజైన్, కంప్యూటర్ సైన్స్ లేదా సంబంధిత రంగాలు, %ాూ×%-సహాయక గేమ్ డెవలప్‌మెంట్ లేదా ప్లేటెస్టింగ్‌లో అనుభవం ఉన్నవారిని నియమించుకోనున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఎంపికైన అభ్యర్థులు గ్రోక్‌కు వీడియో గేమ్‌లకు సంబంధించిన అంశాలను ఎలా అర్థం చేయిస్తారనే విషయంపై వివరణాత్మక అభిప్రాయాలు తెలపాల్సి ఉంటుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

ఎలాన్ మస్క్ నేతృత్వంలోని కృత్రిమ మేధ అంకుర సంస్థ ఎక్స్‌ఏఐ తీసుకొచ్చిన ఏఐ చాట్‌బాట్ గ్రోక్. చాట్‌జీపీటీ తరహాలో ఇది పనిచేస్తుంది. 2023లో అందుబాటులోకి వచ్చిన ఈ ఏఐ.. ఎప్పటికప్పుడు కొత్తరూపు సంతరించుకుంటోంది. ఇది ఎక్స్ ప్లాట్‌ఫామ్‌లో తాజా సమాచారాన్ని సైతం

# ఆ కత్తిపై ట్రంప్ కన్ను..

## కాదన్నందుకు ఉద్యోగిపై వేటు..!



**అమెరికా : అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి పదవిలోకి వచ్చాక.. తాను అనుకొన్నది జరగకపోతే అస్సలు ఊరుకోవడం లేదు. దీనికి సంబంధించి తాజాగా మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. ఆయన కన్ను ఓ మ్యూజియంలోని పురాతన కత్తిపై పడింది. దానిని ఐరోపాలోని ఓ రాజుకు బహూకరించాలనుకొని.. కత్తి పంపించమని ఆ మ్యూజియంకు కబురుపెట్టారు. ఆ మ్యూజియం నిర్వాహకుడు అది అమెరికా చారిత్రక సంపద అని, తాను ఇవ్వనని తేల్చిచెప్పాడు. అంతే.. ఉద్యోగంలో ఉంటావా.. పీకిపారేయాలా అని ట్రంప్ కార్యవర్గం నుంచి ఫోనొచ్చింది. అయినా సరే నిర్వాహకుడు ఆ కత్తి కోసం తన ఉద్యోగాన్నే వదులుకొన్నాడు.**


అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గత నెల బ్రిటన్ పర్యటనకు వెళ్లారు. ఈసందర్భంగా అక్కడి రాజు చార్లెస్‌కు బహూకరించేందుకు ప్రెసిడెంట్ డ్వైట్ డి ఐసన్‌హోవర్ లైబ్రరీ అండ్ మ్యూజియంలో పురాతన ఖడ్గాల కలెక్షన్ నుంచి ఒక దానిని రాజుకు ఇవ్వాలని భావించారు. దీంతో విదేశాంగశాఖ రంగంలోకి దిగి ఆ కత్తిని అప్పగించాలని కోరింది. వాస్తవానికి ఆయన కోరిన ఖడ్గం ఐసన్‌హోవర్‌కు 1947లో బహుమతిగా లభించింది. అప్పట్లో ఆయన అమెరికాకు చీఫ్ ఆఫ్ ది ఆర్మీగా పనిచేసేవారు. అప్పటి హాలెండ్ రాణి విల్‌హెల్మిన దానిని బహూకరించారు. దీంతో ఆ ఖడ్గాన్ని ట్రంప్‌నకు అప్పగించేందుకు లైబ్రరీ నిరాకరించింది. అది అమెరికా ప్రజల ఆస్తి అని తేల్చిచెప్పింది. దీంతో చేసేదిలేక.. మెలానియా ట్రంప్ అలాంటి ఖడ్గం నమూనాను బ్రిటన్ రాజు చార్లెస్ కు బహూకరించారు.

ఆ పర్యటనను ముగించి తిరిగివచ్చాక సదరు లైబ్రరీ డైరెక్టర్ టోడ్డ్ ఆరింగ్టన్‌కు వేధింపులు మొదలయ్యాయి. ట్రంప్ కార్యవర్గానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు చెలరేగాయి. దీనిని ఆరింగ్టన్ ఖండించారు. తాను తప్పుగా ఎప్పుడూ మాట్లాడలేదన్నారు. అయితే ఇటీవల ఆయనకు ఉన్నతాధికారులు ఫోన్ చేసి రాజీనామా చేయాలని లేకపోతే తొలగిస్తామని తేల్చిచెప్పారు. దీంతో ఆరింగ్టన్ రాజీనామా చేశారు. తనకు చరిత్ర, ఉద్యోగం అంటే చాలా ఇష్టమని ఆయన వాపోయారు.

ఐసన్‌హోవర్ రెండో ప్రపంచ యుద్ధ సమయంలో మిత్ర సేనలకు ఐరోపాలో సుప్రీం కమాండర్‌గా వ్యవహరించారు. 1953 నుంచి 1961 వరకు అమెరికా అధ్యక్షుడిగా పనిచేశారు.

# ముంచుకొస్తున్న 'శక్తి'..

## అరేబియా తీరంలో తుపాను ముప్పు



**అరేబియా : 'సైక్లోన్ శక్తి' ముంచుకొస్తోంది. ఈ ఏడాదిలో అరేబియా సముద్రంలో తొలి తుపాను ఏర్పడిందని తాజాగా భారత వాతావరణశాఖ వెల్లడించింది. అరేబియా సముద్రంలో ఈశాన్యంవైపు ద్వారకకు 240 కి.మీ, పోర్‌బందర్‌కు 270 కి.మీ దూరంలో ఈ అల్పపీడనం ఏర్పడింది. అది వాయుగుండంగా బలపడి గంటకు 12కి.మీ. వేగంతో పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. అది మరో మూడుగంటల్లో తుపానుగా మారే అవకాశం ఉంది. రానున్న 24 గంటల్లో తీవ్ర తుపానుగా మారవచ్చు. దీనిని 'సైక్లోన్ శక్తి'గా పిలుస్తున్నారు.**

ప్రపంచ వాతావరణ సంస్థ ఆదేశాల ప్రకారం హిందూ మహాసముద్రం తీరప్రాంతంగా కలిగిన 13దేశాలు ఈ పేర్లను నిర్ణయిస్తాయి. భారత్, బంగ్లాదేశ్, ఇరాన్, మాల్దీవులు, మియన్మార్, ఒమన్, పాకిస్థాన్, ఖతార్, సౌదీ అరేబియా, శ్రీలంక, థాయిలాండ్, యూఏఈ, యెమెన్ ఆ దేశాలు. కొన్ని తుపానుల ప్రభావం వారం కన్నా ఎక్కువ రోజులు ఉంటుంది. అదే సమయంలో మరో తుపాను వస్తే ఎలా అని ఆలోచించి వాటికి పేర్లు పెట్టడం ప్రారంభించారు. ఈ సారి శక్తిపేరును శ్రీలంక పెట్టింది. ఒక్కో తుపానుకు ఒక్కో పేరు పెడితే డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు, మీడియాకు, సాధారణ ప్రజలకు ఇది ఫలానా తుపాను అని గుర్తుండిపోతుంది. అంతేకాకుండా ఆ పేరుతో ప్రజలను అప్రమత్తం చేసే అవకాశం ఉంటుంది. ఈ పేర్లు వీలయినంత చిన్నగా.. సులభంగా పలికే విధంగా ఉండాలనే నిబంధన ఉంది.

ప్రపంచ వ్యాప్తంగా ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాలు, నాలుగు ప్రాంతీయ ఉష్ణమండల తుపాను హెచ్చరిక కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాలు తుపానుల గురించి సలహాలు, సమాచారం ఇస్తుంటాయి. అలాగే వాటికి పేర్లు పెడుతుంటాయి. ఆరు ప్రాంతీయ ప్రత్యేక వాతావరణ కేంద్రాల్లో భారత వాతావరణశాఖ ఒకటిగా పనిచేస్తోంది. ఇది ఉత్తర హిందూ మహా సముద్రంపై గరిష్ఠంగా గంటకు 60 కిలోమీటర్ల ఉపరితల వేగంతో గాలులు వీచే తుపాన్లకు పేర్లు పెడుతుంది. అక్షర క్రమం ఆధారంగా ఒక్కో దేశం ఓ తుపానుకు పేరును సూచిస్తుంది. ప్రతి సారి ఆ పేరు కొత్తగా.. మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలి. పేరు 8 అక్షరాలకు మించరాదు. అది ఏ సభ్య దేశానికీ అభ్యంతరకరంగా ఉండకూడదు. ఏ వర్గం ప్రజల మనోభావాలను దెబ్బతీయకూడదు.

# 21 నిమిషాల్లో 100 పరుగులు..

## 32 ఏళ్లుగా ఈ రికార్డును బీట్ చేసే ప్లేయర్ పుట్టలేదు మామ

**క్రికెట్ చరిత్రలో అత్యంత వేగవంతమైన సెంచరీల గురించి చర్చ వచ్చినప్పుడల్లా బంతుల ఆధారంగా సాధించిన సెంచరీలు మాత్రమే గుర్తుకు వస్తాయి. కానీ, టైం ఆధారంగా అత్యంత వేగవంతమైన సెంచరీ రికార్డు ఇంగ్లాండ్ ఆల్‌రౌండర్ గ్లెన్ చాపెల్ పేరు మీద ఉంది. చాపెల్ 1993లో ఒక ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లో కేవలం 21 నిమిషాల్లోనే సెంచరీ బాది సంచలనం సృష్టించాడు. ఈ రికార్డు 32 సంవత్సరాల తర్వాత కూడా అజేయంగా నిలిచి ఉంది. లంకాషైర్ తరపున ఆడుతున్న చాపెల్ 1993 జూలై 15న గ్లామోర్గన్ పై ఈ అద్భుతాన్ని సాధించాడు.**



లంకాషైర్ రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేయడానికి దిగినప్పుడు, చాపెల్ ఓపెనర్‌గా క్రీజ్‌లోకి వచ్చాడు. క్రీజ్‌లోకి అడుగుపెట్టిన వెంటనే అతను బౌలర్లపై విరుచుకుపడ్డాడు. చాపెల్ కేవలం 21 నిమిషాల్లో, 27 బంతుల్లోనే సెంచరీని పూర్తి చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో అతని బ్యాట్ నుండి 10 ఫోర్లు, 9 సిక్సర్లు వచ్చాయి. సమయం పరంగా ఇది ఫస్ట్ క్లాస్ క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకు నమోదైన అత్యంత వేగవంతమైన సెంచరీ.

అంతకుముందు ఈ రికార్డు ఆస్ట్రేలియాకు చెందిన టమ్ మూడీ పేరు మీద ఉండేది. మూడీ 1990లో వార్విక్‌షైర్ పై గ్లామోర్గన్ తరపున ఆడుతూ కేవలం 26 నిమిషాల్లో సెంచరీ చేశాడు. చాపెల్, మూడీ రికార్డును బద్దలు కొట్టి కొత్త చరిత్ర సృష్టించాడు. తొలి ఇన్నింగ్స్‌లో లంకాషైర్ 310 పరుగులు చేసింది. సమాధానంగా, గ్లామోర్గన్ 303 పరుగులకు తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. దీంతో లంకాషైర్‌కు కేవలం 7 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది.

ఆ తర్వాత చాపెల్ ధనాధన్ ఇన్నింగ్స్‌తో లంకాషైర్ కేవలం 12 ఓవర్లలోనే 235 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. గ్లామోర్గన్‌కు 243 పరుగుల లక్ష్యం లభించింది, దీనిని వారు కేవలం 52.1 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి సాధించారు. చాపెల్ తుఫాన్ సెంచరీ జట్టును గెలిపించలేకపోయినప్పటికీ, క్రికెట్ చరిత్రలో ఈ ఇన్నింగ్స్ శాశ్వతంగా నిలిచిపోయింది.

గ్లెన్ చాపెల్ దేశీయ క్రికెట్ కెరీర్ అద్భుతంగా సాగింది. కానీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అదృష్టం అతనితో లేదు. 2006లో అతను ఇంగ్లాండ్ తరపున వన్డే అరంగేట్రం చేశాడు, కానీ అదే మ్యాచ్‌లో గాయపడ్డాడు. కేవలం నాలుగు ఓవర్లు వేసిన తర్వాత అతన్ని మైదానం నుండి బయటకు తీసుకెళ్లారు, ఆ తర్వాత అతనికి మళ్లీ ఇంగ్లాండ్ జట్టు జెర్సీ ధరించే అవకాశం రాలేదు.

32 సంవత్సరాల తర్వాత కూడా చాపెల్ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. నేటి వేగవంతమైన క్రికెట్, టీ20 యుగంలో కూడా ఇంత తక్కువ సమయంలో సెంచరీ సాధించిన ఆటగాడు మరెవరూ రాలేదు. అందుకే క్రికెట్ అభిమానులకు ఈ ఇన్నింగ్స్ ఒక లెజెండరీ కథ కంటే తక్కువ కాదు.

# కేఎల్ రాహుల్ సెంచరీల మోత..

## వెస్టిండీస్‌పై అద్భుత శతకం.. 11 ఏళ్లలో 11 టెస్ట్ సెంచరీలు

**భారత స్టార్ బ్యాట్స్‌మెన్ కేఎల్ రాహుల్ వెస్టిండీస్‌తో అహ్మదాబాద్‌లో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీతో చెలరేగిపోయాడు. రాహుల్ 190 బంతుల్లో 12 ఫోర్లతో ఈ సెంచరీని పూర్తి చేశాడు. వెస్టిండీస్‌పై కేఎల్ రాహుల్ సాధించిన ఈ సెంచరీ అనేక ప్రత్యేకతలను కలిగి ఉంది. ఈ సెంచరీ భారతదేశానికి ఆధిక్యాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, కేఎల్ రాహుల్ ఖాతాలో అనేక రికార్డులను కూడా నమోదు చేసింది. అతని కెరీర్‌లో ఇది 11వ టెస్ట్ సెంచరీ కాగా, గత 9 ఏళ్ల తర్వాత స్వదేశంలో సాధించిన సెంచరీ కావడం విశేషం.**



కేఎల్ రాహుల్ తన టెస్ట్ కెరీర్‌ను 2014లో ప్రారంభించాడు. అప్పటి నుండి ఇప్పటి వరకు, అంటే 11 ఏళ్లలో, అతని బ్యాట్ నుండి టెస్ట్ క్రికెట్‌లో 11 సెంచరీలు వచ్చాయి. టెస్ట్ కెరీర్‌లో వెస్టిండీస్‌పై ఇది అతని రెండో టెస్ట్ సెంచరీ. దీనికి ముందు, అతను 9 సంవత్సరాల క్రితం అంటే 2016లో కింగ్‌స్టన్‌లో కరీబియన్ జట్టుపై తన మొదటి సెంచరీని సాధించాడు.

భారత గడ్డపై కేఎల్ రాహుల్ సెంచరీ సాధించడం 9 ఏళ్ల తర్వాత జరిగింది. స్వదేశంలో అతను చివరి సెంచరీ 2016లో ఇంగ్లాండ్‌తో చెన్నైలో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో చేశాడు. ఆ మ్యాచ్‌లో భారత ఓపెనర్ 199 పరుగులు చేశాడు, ఇది ఇప్పటి వరకు అతని టెస్ట్ కెరీర్‌లో అత్యధిక స్కోరు. సొంత మైదానంలో సెంచరీ కోసం రాహుల్ చాలా కాలం వేచి చూడాల్సి వచ్చింది. ఈ సెంచరీతో అతను ఆ నిరీక్షణకు తెరదించాడు.

వెస్టిండీస్‌తో అహ్మదాబాద్ టెస్ట్‌లో కేఎల్ రాహుల్ ఓపెనర్‌గా బరిలోకి దిగాడు. ఓపెనర్‌గా ఈ సంవత్సరంలో అతను సాధించిన రెండో టెస్ట్ సెంచరీ ఇది. దీనికి ముందు, అతను ఇంగ్లాండ్ పర్యటనలో తన మొదటి సెంచరీని నమోదు చేశాడు. వెస్టిండీస్‌తో జరిగిన ఈ శతక ఇన్నింగ్స్ సమయంలో, కేఎల్ రాహుల్ శుభ్‌మన్ గిల్?తో కలిసి మూడో వికెట్‌కు 98 పరుగులు జోడించాడు. ఈ భాగస్వామ్యంతో భారతదేశం మంచి స్థితికి చేరుకుంది.

ఇదే సమయంలో కేఎల్ రాహుల్ ఈ సంవత్సరంలో అత్యధిక టెస్ట్ పరుగులు సాధించిన ఓపెనర్‌గా కూడా నిలిచాడు. ఇది అతని అద్భుతమైన ఫామ్‌ను సూచిస్తుంది. అహ్మదాబాద్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో భారత్ భారీ స్కోరుపై దృష్టి సారించింది. తద్వారా వెస్టిండీస్‌పై పెద్ద విజయాన్ని నమోదు చేయవచ్చు. టీమ్ ఇండియా ఈ లక్ష్యాన్ని చేరుకోవడంలో కేఎల్ రాహుల్ ఇన్నింగ్స్ కీలక పాత్ర పోషించగలదు. అతని సెంచరీ జట్టుకు మంచి పునాది వేసింది. దీనివల్ల ఇతర బ్యాట్స్‌మెన్ స్వేచ్ఛగా ఆడే అవకాశం లభించింది.

# ఇలాంటి వింత అవుట్లు పాక్ వాళ్లకే సాధ్యం..

## ఆ లిస్టులో నాష్రా సంధు మూడో ప్లేయర్

మహిళల ప్రపంచ కప్ 2025లో పాకిస్తాన్, బంగ్లాదేశ్ మధ్య కొలంబోలోని ఆర్ ప్రేమదాస స్టేడియంలో గురువారం జరిగిన మ్యాచ్‌లో ఒక విచిత్రమైన సంఘటన చోటు చేసుకుంది. పాకిస్తాన్ స్పిన్నర్ నాష్రా సంధు అసాధారణమైన హిట్ వికెట్ అవుట్‌తో పెవిలియన్ చేరింది. వరల్డ్ కప్ మ్యాచ్‌లలో హిట్‌వికెట్ అయిన మూడవ పాకిస్తాన్ క్రికెటర్‌గా ఆమె నిలిచింది. అంతకుముందు పాకిస్తాన్ తరపున మిస్బా-ఉల్-హక్, ఇమామ్-ఉల్-హక్ ఇలాగే అవుట్ అయ్యారు. ఈ మ్యాచ్‌లో రుబియా హైదర్ అజేయమైన హాఫ్ సెంచరీతో బంగ్లాదేశ్ 7 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించి ఘన విజయం సాధించింది.

35వ ఓవర్ రెండో బంతికి షోర్నా అక్తర్ వేసిన ఫుల్ లెంగ్త్ డెలివరీని ఆడేందుకు నాష్రా సంధు ప్రయత్నించింది. చివరి క్షణంలో తన బ్యాట్‌ను వెనక్కి తీసుకుంది, కానీ ఆమె బ్యాట్ ఫాలో-త్రూ సమయంలో అనుకోకుండా స్టంప్స్‌ను తగిలింది. దీంతో ఆమె హిట్‌వికెట్‌గా అవుట్ అయ్యింది. ఈ విచిత్రమైన ఔట్‌ను చూసి అందరూ ఆశ్చర్యపోయారు.

బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్ రుబియా హైదర్ అజేయంగా 54 పరుగులు (77 బంతుల్లో 8 బౌండరీలతో) చేసి జట్టును విజయపథంలో నడిపింది. కెప్టెన్ నిగర్ సుల్తానా (44 బంతుల్లో 23 పరుగులు)తో కలిసి 62 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పింది. బంగ్లాదేశ్ 130 పరుగుల లక్ష్యాన్ని 113 బంతులు మిగిలి ఉండగానే ఛేదించింది. మొదట్లో బంగ్లాదేశ్ ప్రారంభ వికెట్లు కోల్పోయినప్పుడు రుబియా జాగ్రత్తగా ఆడింది. ఆ తర్వాత వేగంగా పరుగులు చేసి, ముఖ్యంగా 19వ ఓవర్‌లో నాష్రా సంధు బౌలింగ్‌లో అనేక బౌండరీలు కొట్టింది.

బంగ్లాదేశ్ విజయంలో మారుఫా అక్తర్ బౌలింగ్ కీలక పాత్ర పోషించింది. ఆమె అద్భుతమైన ప్రారంభ స్పెల్‌తో పాకిస్తాన్‌ను దెబ్బతీసింది. మొదటి ఓవర్‌లోనే ఓమైమా సోహైల్, సిద్రా అమీన్ ?లను డకౌట్ చేసి పాకిస్తాన్‌ను 2 పరుగులకే 2 వికెట్లు కోల్పోయేలా చేసింది. మారుఫాతో పాటు నహీదా అక్తర్ కూడా పాకిస్తాన్ ఇన్నింగ్స్‌ను అస్థిరపరిచింది. ఆమె మునీబా అలీ, రమీన్ షమీమ్?లను పవర్ ప్లే తర్వాత త్వరగానే పెవిలియన్ పంపింది. దీంతో పాకిస్తాన్‌కు పెద్ద భాగస్వామ్యాలు ఏర్పడలేదు.



పాకిస్తాన్ ఇన్నింగ్స్ ఎప్పుడూ ఊపందుకోలేదు. వారు క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోతూనే ఉన్నారు. బంగ్లాదేశ్ వ్యూహాత్మక బౌలింగ్ మార్పులు పాకిస్తాన్‌ను ఇన్నింగ్స్ పొడవునా ఒత్తిడిలో ఉంచాయి. పాకిస్తాన్ 38.3 ఓవర్లలో కేవలం 129 పరుగులకే ఆలౌట్ అయ్యింది. మొత్తంగా, ఈ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ అన్ని విభాగాల్లోనూ రాణించి ఘన విజయం సాధించగా, పాకిస్తాన్ జట్టుకు బ్యాటింగ్, ఫీల్డింగ్‌లో నిరాశ ఎదురైంది. నాష్రా సంధు విచిత్రమైన అవుట్‌తో పాటు, పాకిస్తాన్ పేలవ ప్రదర్శన ఈ మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది.

# సోషల్ మీడియాకు దూరం.. కనీసం ఫోన్ చేసినా ఎత్తడు..

## భారత క్రికెటర్ షాకింగ్ వ్యాఖ్యలు



**ఎంఎస్ ధోనీని కెప్టెన్ కూల్ అని ఊరికే అనరు. మైదానంలో ఎంత కఠిన పరిస్థితుల్లోనైనా అతను ప్రశాంతంగా, సంయమనంతో ఉంటాడు. టీమ్ ఇండియాకు అత్యంత సక్సెస్ ఫుల్ కెప్టెన్‌లలో ఒకరైన ధోనీ, ఐపీఎల్‌లో కూడా చెన్నై సూపర్ కింగ్స్?ను 5 సార్లు ఛాంపియన్‌షిప్ అందించాడు. ధోనీ కోట్ల మంది యువకులకు ఆదర్శం, అయితే అతను సోషల్ మీడియాకు మాత్రం చాలా దూరంగా ఉంటాడు. ధోనీతో పాటు సీఎస్కే జట్టులో భాగమైన భారత క్రికెటర్ సాయి కిషోర్, ధోనీ ఫోన్ అస్సలు ఎత్తడని, అది ఎలా తనపై ప్రభావం చూపిందో తాజాగా ఒక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.**

ఎంఎస్ ధోనీ నాయకత్వంలో ఐపీఎల్ ఆడిన భారత క్రికెటర్లు లేదా విదేశీయులు అయినా సరే, అందరూ ధోనీ కెప్టెన్సీని, అతని ప్రవర్తనను పొగుడుతూనే ఉంటారు. అతను ఆటగాళ్లతో బాగా కనెక్ట్ అవుతాడు. వారి నుండి విషయాలు నేర్చుకుంటూ ఉంటాడు. అయితే సాయి కిషోర్ మాత్రం ధోనీ గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు.

సాయి కిషోర్ ఐపీఎల్ కెరీర్ 2020లో చెన్నై సూపర్ కింగ్స్‌తో ప్రారంభమైంది. అప్పుడు CSK అతన్ని 20 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది. రెండు సీజన్‌లలో జట్టులో భాగమైనప్పటికీ, అతనికి ఆడే అవకాశం రాలేదు. 2022లో, గుజరాత్ టైటాన్స్ అతన్ని 3 కోట్ల రూపాయలకు కొని తమ జట్టులో చేర్చుకుంది. CSK లో ఉన్నప్పుడు ధోనీ నుండి తాను ఏమి నేర్చుకున్నాడో సాయి కిషోర్ వివరించారు.

ప్రోవోక్ టీవీకి ఇచ్చిన ఇంటర్వ్యూలో సాయి కిషోర్ మాట్లాడుతూ.. "నేను ఎంఎస్ ధోనీ నుంచి చాలా నేర్చుకున్నాను. అతను తన ఫోన్ అస్సలు ఎత్తేవాడు కాదు. మ్యాచ్‌లకు వెళ్ళేటప్పుడు తన ఫోన్‌ను హోటల్ రూమ్‌లోనే వదిలిపెట్టి వెళ్ళేవాడు. అతను సోషల్ మీడియాకు చాలా దూరంగా ఉండేవాడని చెప్పారు.

"సోషల్ మీడియాకు కనెక్ట్ అయి ఉండటం నిజంగా అవసరమా అని నేను నన్ను నేనే ప్రశ్నించుకునేవాడిని. అందుకే అతన్ని చూసి నాకు స్ఫూర్తి కలిగింది" అని సాయి కిషోర్ అన్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతి క్రికెటర్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటున్నాడు. ఇది డబ్బు సంపాదించడానికి, అభిమానుల సంఖ్యను పెంచుకోవడానికి ఒక మార్గం కూడా. కానీ ఎంఎస్ ధోనీ మాత్రం సోషల్ మీడియాలో చాలా తక్కువగా యాక్టివ్‌గా ఉంటాడు. పండుగలైనా, ఎవరి పుట్టినరోజైనా లేదా ఏదైనా పెద్ద ఈవెంట్ అయినా, ధోనీ చాలా అరుదుగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తాడు.

ధోనీ ఈ ప్రశాంతమైన లైఫ్ స్టైల్, ఫోన్‌కు, సోషల్ మీడియాకు దూరంగా ఉండటం వంటి అలవాట్లే అతను మైదానంలో కెప్టెన్ కూల్?గా ఉండటానికి ఒక ప్రధాన కారణమని సాయి కిషోర్ వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది. ఇది యువ క్రికెటర్లకు, సాధారణ ప్రజలకు కూడా ఒక మంచి గుణపాఠం.

# సరిహద్దులు దాటిన అభిమానం...

## దసరా శుభాకాంక్షలు తెలిపిన పాక్ క్రికెటర్ డానిష్ కనేరియా



**పాకిస్తాన్ మాజీ క్రికెటర్ డానిష్ కనేరియా సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ %ః% ద్వారా దసరా పండుగ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయాన్ని సూచించే ఈ పండుగను భారతదేశం అంతటా గొప్ప ఉత్సాహంతో జరుపుకుంటారు. కనేరియా తన మెసేజ్?లో శాంతి, బలం, కరుణను కోరుతూ, సరిహద్దులు దాటిన అభిమానుల హృదయాలను గెలుచుకున్నారు. భారతదేశం-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్త రాజకీయ సంబంధాలు ఉన్నప్పటికీ, కనేరియా ఇలాంటి శుభాకాంక్షలు తెలపడం ఒక అరుదైన సానుకూల పరిణామంగా నిలిచింది.**

కనేరియా తన పోస్ట్‌లో ఇలా రాశారు.. "మీకు దసరా శుభాకాంక్షలు. ఈ రోజున మనం చెడుపై మంచి సాధించిన విజయాన్ని, చీకటిపై వెలుగు సాధించిన విజయాన్ని గుర్తుచేసుకుంటాం. ఈ పండుగ మీ జీవితంలో శాంతి, జ్ఞానం, బలాన్ని తీసుకురావాలని, సత్యం, కరుణ మార్గంలో నడవడానికి మిమ్మల్ని ప్రేరేపించాలని ఆశిస్తున్నాను." అంతర్జాతీయ స్థాయిలో పాకిస్తాన్‌కు ప్రాతినిధ్యం వహించిన కొద్దిమంది హిందూ క్రికెటర్లలో కనేరియా ఒకరు. ఆయన తరచుగా పండుగల సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, మత సామరస్యాన్ని ప్రోత్సహిస్తారు. ఆయన మాటల్లో ప్రతిబింబించిన ఐక్యత, సద్భావనకు నెటిజన్లు సానుకూలంగా స్పందించారు.

భారతదేశంలో, ప్రపంచవ్యాప్తంగా దసరా హిందూ సంఘాలు గొప్ప ఉత్సాహంతో జరుపుకునే పండుగ. ఇది రాముడు రాక్షస రాజు రావణుడిపై సాధించిన విజయాన్ని, దుర్మార్గంపై ధర్మం సాధించిన విజయాన్ని సూచిస్తుంది. కనేరియా ఈ సద్భావన కేవలం దసరా శుభాకాంక్షలకే పరిమితం కాలేదు. గతంలో కూడా, సరిహద్దుల్లో ఉద్రిక్త రాజకీయ సంబంధాలు ఉన్నప్పటికీ, ఆయన భారత ప్రధాని నరేంద్ర మోడీకి తన 75వ పుట్టినరోజు సందర్భంగా (సెప్టెంబర్ 17న) సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ %ః% ద్వారా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

కనేరియా తన పోస్ట్‌లో.. "గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి పుట్టినరోజు శుభాకాంక్షలు. మీకు మంచి ఆరోగ్యం కలగాలని.. భారతదేశాన్ని శాంతి, శ్రేయస్సు వైపు నడిపించడంలో నిరంతర విజయం చేకూరాలని ఆశిస్తున్నాను." అంటూ రాసుకొచ్చారు.

సరిహద్దులకు ఇరువైపులా ఉన్న నెటిజన్ల నుండి ఈ మెసేజ్ త్వరగా దృష్టిని ఆకర్షించింది. భారతదేశం, పాకిస్తాన్ మధ్య తరచుగా ఉద్రిక్తంగా ఉండే రాజకీయ సంబంధాల మధ్య ఇది ఒక అరుదైన సద్భావన క్షణంగా చాలా మంది దీనిని అభివర్ణించారు. ప్రధానమంత్రి మోడీకి ప్రపంచ నాయకులు, ప్రముఖులు, రాజకీయ మిత్రులు, ప్రజల నుండి శుభాకాంక్షలు వెల్లువెత్తినప్పటికీ, కనేరియా పోస్ట్ సరిహద్దులు దాటిన అభిమానాన్ని కలిగి ఉంది.

# మారియో' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల



'నాటకం', 'తీస్ మార్ ఖాన్' వంటి డిఫరెంట్ చిత్రాలతో దర్శకుడిగా కళ్యాణ్ జీ గోగణ మంచి పేరు సంపాదించుకున్నారు. ఇక దసరా సందర్భంగా ఆయన తదుపరి చిత్రం 'మారియో' నుంచి అప్డేట్ ఇచ్చారు. 'మారియో' నుంచి అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో అందరినీ అలరించారు. ఈరోజు విడుదలైన ఈ పోస్టర్.. 'ఎ టర్బో-చార్జ్ ర్యాంప్ రైడ్' అనే ట్యాగ్‌లైన్‌తో అందరినీ ఆశ్చర్యపరిచింది. యాక్షన్-ప్యాక్డ్, స్టైలిష్, రొమాంటిక్ వైబ్‌తో ఈ పోస్టర్ ఇట్టే ట్రెండ్ అవుతోంది. ఫస్ట్ లుక్‌లో హీరో అనిరుధ్, హెబ్బా పటేల్ పెట్టిన పోజుతో వారి మధ్య ఉన్న కెమిస్ట్రీ అర్థం అవుతుంది. అనిరుధ్ రైఫిల్ పట్టుకుని ఉన్న తీరు, ఇంటెన్స్ లుక్ చూస్తుంటే హై ఓల్టేజ్ యాక్షన్ సీన్స్ ఉండేలా కనిపిస్తున్నాయి. హెబ్బా పటేల ఎరుపు రంగు దుస్తుల్లో డైనమిక్ గా కనిపిస్తున్నారు. క్లాసిక్ కారు, చీకటి, వర్షం ఇలా అన్నింటినీ చూస్తుంటే థ్రిల్లర్ థీమ్‌ను సూచిస్తుంది. సీట్ ఎడ్జ్ థ్రిల్ కలిగించేలా అన్ని రకాల కమర్షియల్ అంశాలను తగినంత వినోదంతో మిళితం చేసే చిత్రాన్ని అందించనున్నారు. సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో 'మారియో' చిత్రాన్ని నిర్మిస్తుండగా రిజ్వాన్ ఎంటర్‌టైన్‌మెంట్ సహ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు. గత చిత్రాలలో కామెడీ, థ్రిల్‌ను విజయవంతంగా మిళితం చేసిన దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ ఈసారి సినిమాటిక్ అనుభవాన్ని అందించబోతున్నారు. ఈ చిత్రానికి సాయి కార్తీక్, రాకేందు మౌళి సంగీతాన్ని అందిస్తున్నారు. పాటలు, మాటలు రాకేందు మౌళి సమకూరుస్తున్నారు. కథ, సంభాషణలను అభివృద్ధి చేయడంలో రాకేందు మౌళి కూడా గోగణకు మద్దతు ఇచ్చారు. %వీచీ% రెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, మణికాంత్, మదీ మన్నెపల్లి ఎడిటర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పూర్తి స్థాయి నిర్మాణంలో ఉంది. ఈ పండుగ సీజన్‌లో ఫస్ట్ లుక్ పోస్టర్ ఖచ్చితంగా సంచలనాన్ని సృష్టించిందనే చెప్పొచ్చు. తారాగణం: అనిరుధ్, హెబా పటేల్, రాకేందు మౌళి, మౌర్య సిద్ధవరం, యష్నా ముతులూరి, కల్పిక గణేష్, మదీ మన్నెపల్లి, లతా రెడ్డి తదితరులు

# 10న 'అరి' విడుదల

ఆర్వీ సినిమాస్ పతాకంపై రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్ వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి, శేషురెడ్డి మారంరెడ్డి, నాయుడు నిర్మిస్తున్న సినిమా 'అరి'. లింగ గుబపనేని కో ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు. ఈ చిత్రానికి 'మై నేమ్ ఈజ్ నో బడీ' అనేది ఉపశీర్షిక. వినోద్ వర్మ, అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. "పేపర్ బాయ్" చిత్రంతో ప్రతిభావంతమైన దర్శకుడుగా పేరు తెచ్చుకున్న జయశంకర్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. విజయదశమి సందర్భంగా 'అరి' సినిమా రిలీజ్ డేట్ ను మేకర్స్ అనౌన్స్ చేశారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న 'అరి' సినిమాను ఏషియన్ సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10వ తేదీన వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే కమర్షియల్ ఎలిమెంట్స్ తో పాటు ఒక మంచి మెసేజ్ తో 'అరి' సినిమాను రూపొందించారు దర్శకుడు జయశంకర్. ఇప్పటికే ఈ సినిమా పాటలు ఛాట్ బస్టర్స్ అయ్యాయి. ప్రమోషనల్ కంటెంట్ కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే థియేట్రికల్ గా 'అరి' మూవీ ఘన విజయాన్ని సాధిస్తుందనే అంచనాలు ఏర్పడుతున్నాయి. నటీనటులు %-% వినోద్ వర్మ , అనసూయ భరద్వాజ్, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్, వైవా హర్ష, శ్రీనివాస రెడ్డి, చమ్మక్ చంద్ర, శుభలేక సుధాకర్, సురభి ప్రభావతి, అక్షయా శెట్టి, రిధిమా పండిట్, పి.అనిల్ కుమార్, నవీనా రెడ్డి, తమిళ బిగ్ బాస్ ఫేమ్ పావని రెడ్డి, జెమినీ సురేష్, ఐ డ్రీమ్ అంజలి, మనిక చిక్కాల, సుమన్, ఆమని, ప్రవల్లిక చుక్కల, సురభి విజయ్, బ్యాంకు శ్రీనివాస్, సమీర్, మాణిక్ రెడ్డి, రాజ్ తిరందాస్, గాయత్రి భార్గవి, మీనా కుమారి, లావణ్య రెడ్డి, ఇంటూరి వాసు, జబర్దస్త్ సద్దాం, నీలా ప్రియ, యోగి ఖత్రి తదితరులు




# క్లీన్ ఎంటర్‌టైనర్ 'మిత్ర మండలి'

## విజయవాడ ఉత్సవ్‌లో హీరో ప్రియదర్శి



హైదరాబాద్ : బివి వర్క్స్ బ్యానర్‌పై బన్నీ వాస్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్‌లపై కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'మిత్ర మండలి'. ఈ చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎమ్, విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా నటించారు, వీరిలో వెన్నెల కిషోర్, సత్య, వి.టి.వి. గణేష్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. టీజర్, 'కట్టండుకో జానకి', 'స్వేచా స్టాండు', 'జంబర్ గింబర్ లాలా' వంటి పాటలతో 'మిత్ర మండలి'పై పాజిటివ్ బజ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇక ఈ క్రమంలో సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవలే ఈ చిత్ర బఅందం విజయవాడ ఉత్సవ్ ఈవెంట్‌లో సందడి చేసింది. దసరా సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో.. ప్రెజెంటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ .. 'మేము 'లిటిల్ హార్ట్స్'తో ఎంతగా అయితే నవ్వించామో ఈ 'మిత్ర మండలి'తోనూ అంతే స్థాయిలో ఖచ్చితంగా నవ్విస్తాము. ఆడియెన్స్‌ను ఎంటర్టైన్ చేసేందుకే ఈ చిత్రాన్ని రూపొందించాం. సినిమా చూసి మీరు నవ్వి నవ్వి కడుపునొప్పితో థియేటర్ నుంచి బయటకు వెళ్తారు' అని అన్నారు. ర్మాత భాను ప్రతాప మాట్లాడుతూ .. 'మా ఈ కార్యక్రమానికి విచ్చేసిన విజయవాడ ప్రజలకు ధన్యవాదాలు. మా 'మిత్ర మండలి' బఅందంతో ఈ ఉత్సవ్‌లో పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉంది. అక్టోబర్ 16న అందరినీ నవ్వించేందుకు మేం థియేటర్లోకి వస్తున్నామ'ని అన్నారు. సంగీత దర్శకుడు ఆర్.ఆర్. ధ్రువన్ మాట్లాడుతూ .. ''మిత్ర మండలి' నా కెరీర్‌కు టర్నింగ్ పాయింట్. ఈ మూవీలోని ప్రతీ పాటను శ్రోతలు చార్ట్ బస్టర్‌లుగా మార్చారు. ఈ మూవీతో అందరికీ తప్పకుండా వినోదం లభిస్తుంది. అక్టోబర్ 16న మీ ఫ్రెండ్స్, ఫ్యామిలీతో కలిసి సినిమా చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు. నటుడు ప్రసాద్ బెహరా మాట్లాడుతూ .. 'మా మీద ఇంత ప్రేమను కురిపిస్తున్న విజయవాడ ప్రజలకు ధన్యవాదాలు. అక్టోబర్ 16న మా 'మిత్ర మండలి'తో అందరినీ నవ్విస్తామని హామీ ఇస్తున్నాం' అని అన్నారు. నటుడు విష్ణు ఓఐ మాట్లాడుతూ .. 'మాకు ఆతిథ్యం ఇచ్చినందుకు విజయవాడ ఎక్స్‌పో, ఉత్సవ్ కమిటీకి ధన్యవాదాలు. మా 'మిత్ర మండలి' చిత్రాన్ని ప్రమోట్ చేయడానికి ఇక్కడకు రావడం చాలా సంతోషంగా ఉంది. ఈ చిత్రం చివరి వరకు మిమ్మల్ని నవ్విస్తుంది. 'లిటిల్ హార్ట్స్' కంటే ఎక్కువగా ఈ చిత్రం అందరినీ నవ్విస్తుంది. ప్రియదర్శి ఎప్పుడూ ఓ డిఫరెంట్ కంటెంట్‌లను ఎంచుకుంటూ ఉంటారు. ఈ టీంలో ప్రసాద్ బెహరా, నిహారిక ఎన్‌ఎమ్, నేను, రాగ్ మయూర్, సత్య, వెన్నెల కిషోర్, ఇంకా చాలా మంది ప్రతిభావంతులైన కళాకారులు ఉన్నారు. అక్టోబర్ 16న సినిమాను ఆస్వాదించండి' అని అన్నారు. హీరోయిన్ నిహారిక ఎన్‌ఎమ్ మాట్లాడుతూ ..'విజయవాడ ఉత్సవ్‌లో మమ్మల్ని ఇక్కడకు ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. ఈ రోజు ఇలా మీ అందరితో ఇక్కడ ఉండటం నాకు ఎంతో ప్రత్యేకంగా అనిపిస్తుంది. 'మిత్ర మండలి' పక్కా కామెడీ చిత్రం. కాబట్టి దయచేసి మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి చూసి ఎంజాయ్ చేయండి' అని అన్నారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ .. 'మమ్మల్ని ఇక్కడికి ఆహ్వానించినందుకు విజయవాడ ఉత్సవ్ కమిటీ, ఏపీ పోలీసు బలగాలు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ధన్యవాదాలు. తెలుగు సినిమా గుండె విజయవాడలో కొట్టుకుంటుందని మా పరిశ్రమలోని వ్యక్తులు ఎల్లప్పుడూ చెబుతారు. అక్టోబర్ 16న రానున్న 'మిత్ర మండలి' థియేటర్లలో కుటుంబం మొత్తంతో ఆస్వాదించగల క్లీన్ ఎంటర్‌టైనర్' అని అన్నారు. నటీనటులు : ప్రియదర్శి, నిహారిక ఎన్‌ఎమ్, విష్ణు ఓయి, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా నటించారు, వీరిలో వెన్నెల కిషోర్, సత్య, విటివి గణేష్ తదితరులు


# అఖండ-2 విడుదల తేదీ వచ్చేసిందిఙా




దర్శకుడు బోయపాటి దర్శకత్వంలో నందమూరి బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2: తాండవం' విడుదల తేదీని చిత్ర బృందం విడుదల చేసింది. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్నట్లు ప్రకటించారు. దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ తాజాగా పోస్టర్ విడుదల చేశారు. ఈ పోస్టర్ లో విడుదల తేదీతో పాటు బాలకృష్ణ పొడవాటి జుట్టు, గడ్డంతో, మెడలో రుద్రాక్షలు ధరించి గంభీరంగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఎం.తేజస్విని నందమూరి దీనిని సమర్పిస్తున్నారు. థమన్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. బాలకృష్ణ అంటే చాలు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ హై-వోల్టేజ్ తో మరింత పవర్‌ఫుల్ గా మారుస్తుందని అభిమానులు భావిస్తున్నారు. గతంలో విడుదలైన టీజర్ అభిమానులలో భారీ అంచనాలను పెంచింది.

## 'సంబరాల ఏటి గట్టు' ప్రీ గ్లింప్స్..

# మీరు ఓ లుక్కేయండి..




హైదరాబాద్: 'విరూపాక్ష', 'బ్రో' సినిమాల తర్వాత హీరో సాయి దుర్గ తేజ్ మళ్లీ సిల్వర్ స్క్రీన్‌పై కనిపించలేదు. ప్రస్తుతం అతను చేస్తున్న చిత్రం 'సంబరాల ఏటి గట్టు'. రోహిత్ కెపి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. ఈ సినిమా గురించి ప్రకటన వచ్చినప్పటి నుంచి అభిమానుల్లో సినిమా చూడాలనే ఉత్సాహం నెలకొంది. అయితే చిత్ర యూనిట్ నుంచి అంతగా అప్‌డేట్స్ ఏమీ రాలేదు. అయితే దసరా పండగ సందర్భంగా గురువారం సినిమా ప్రీ గ్లింప్స్‌ని విడుదల చేశారు. అక్టోబర్ 15వ తేదీన గ్లింప్స్‌ని విడుదల చేస్తున్నట్లు ఇందులో ప్రకటించారు. ఇక ఈ సినిమాలో ఐశ్వర్య లక్ష్మీ హీరోయిన్‌గా నటిస్తుండగా.. నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డిలు నిర్మిస్తున్నారు. అజనీశ్ లోకనాథ్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు. జగపతి బాబు, సాయి కుమార్, శ్రీకాంత్, అనన్య నాగళ్ల ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు.

## కాంతార..ఛాప్టర్-1...

# కుటుంబంతో కలిసి చూడాల్సిన సినిమా కాంతార..ఛాప్టర్-1...

కాంతారా సినిమా లో ఆదివాసీల దేవతలు అయిన పంజర్ల, గుళిగ దేవతలు ఎవరు? ఎలా ఆదివాసీల జీవితాలలో వెలుగును నింపారు!, అక్కడ ఉన్న రెండు జాతుల మధ్య వైరం, ఆ కాంతారా అడవిలో ఉన్న సంపద కోసం కన్నేసిన రాజుతో ఎలా వైరం వచ్చింది? అనేది ఈ సినిమాలో మనకు పరిచయం చేస్తారు.. ఇది ఇంతకుముందు వచ్చిన కాంతారా సినిమాకు పూర్వపు కథ ప్రీక్వెల్.. బనవాసి ప్రాంతంలో కదంబ రాజులు పరిపాలించే కాలంలో విజయేంద్ర రాజు కాంతారా అడవులలో ఉన్న సుగంధ ద్రవ్యాలు వాటి సంపద కోసం ఆ కాంతారా అడవిని వశం చేసుకోవాలి అని అనుకుంటాడు. కానీ అడవిని నాశనం చేయడానికి ఒప్పుకొనని దేవత గుళిగ అతనిని సంహరిస్తుంది. అతని కొడుకు రాజశేఖరుడు రాజు అవుతాడు. అతనికి ఆ కాంతారా అడవుల కథ తెలుసు కాబట్టి అతను జాగ్రత్తగా ఉంటాడు. కానీ అతని కుమారుడు కులశేఖరుడు ఆ అడవిని మరల వశం చేసుకోవాలి అని ప్రయత్నిస్తూ ఉంటాడు.. ఆయన కుమార్తె తాంత్రిక విద్యలను అభ్యసించిన కనకవతి కూడా అవకాశం కోసం ఎదురు చూస్తూ ఉంటుంది. ఆ ఆదివాసీలలోనే ఇంకో జాతి తెగ ఆ దేవతల మహిమ తెలిసి వాటిని వశం చేసుకోవాలి అని ప్రయత్నిస్తూ ఉంటుంది. వీళ్ళ నుంచి ఎలా ఆ దేవతలను కాంతార ప్రజలు రక్షించుకుంటారు అనేదే సినిమా ప్లాట్.. సినిమా అదిరిపోయే బిగినింగ్ తో ప్రారంభం అవుతుంది.. తర్వాత కొంచెం నిదానంగా ఉన్నట్లు అనిపించినా కానీ వెంట వెంటనే వచ్చే ఫైటింగ్ సీన్స్ మనవల్ని కథలో ఇన్వాల్వ్ చేస్తాయి.. రథం ఫైటింగ్ తో మనము కొంచెం ఇన్వాల్వ్ కాగానే అత్యద్భుతమైన ప్రీ ఇంటర్వెల్ సీను పులితో చేసే సీక్వెన్స్ తో ఇంటర్వెల్ బాష్ మనకు దక్కుతుంది.. ఆ తర్వాత మనకు ఆదివాసీల దేవతల పరిచయము మరియు పరమశివుడు మరియు నందీశ్వరుని సీన్లతో నోరు వెళ్ళబెట్టేలా చేస్తాయి.. రాజును గుళిగ చంపే



సీనుతో మనకు గూస్బంస్ వస్తాయి.. ఇది కాంతారా సినిమాలో ఉన్న క్లైమాక్స్ సీన్ ను గుర్తు చేసినట్లు అనిపిస్తుంది.. కానీ అంతటితో సినిమా అయిపోదు మరలా ఇంకో సీను క్లైమాక్స్ లో మనకు గూస్బంప్ తెప్పిస్తుంది.. చాముండి వచ్చే సీన్ అయితే సూపర్బ్. వీఎఫ్ఎక్స్ బిజిఎం సూపర్ గా ఉంటాయి. అజనీష్ లోకనాథ్ మ్యూజిక్కు అత్యద్భుతమైన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో మనవల్ని కట్టిపడేస్తాడు. హీరో రిషబ్ శెట్టి ఆహార్యం అతని నటన ఇక చెప్పడానికి మనకు మాటలు రావు చూడాల్సిందే. రుక్మిణి వాసంతి హీరోయిన్ చాలా బాగా నటించింది అందం గా ఉంది. జయరామ్ నటన బాగుంది. సినిమాలో మార్షల్ ఆర్ట్స్ కలరిపట్టు విద్యలు గుర్రపు స్వారీలు మనకు కనువిందు చేస్తాయి. సకలేశ్వరపుర అడవులలో తీసిన అడవి దృశ్యాలు మనకు కనువిందు చేస్తాయి. ఫోటోగ్రఫీ అత్యద్భుతంగా ఉంది. సినిమాలో అక్కడ అక్కడ కన్నడ భాషలోనే వ్యాఖ్యానం ఉంటుంది. దానికి తెలుగు సబ్ టైటిల్స్ వేస్తారు. అదొక్కటే కొంచెం నెగిటివ్ పాయింట్. పాటలు రొమాన్స్ సీన్లు లేవు. అసభ్యమైన సన్నివేశాలు లేవు. ఇంటిల్లిపాది చక్కగా చూడొచ్చు...

TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339